# ప్రభంజనం

తెలుగు దినపత్రిక

సంపుటి: 01 సంచిక: 57
పేజీలు: 10 వెల: 5

Follow: prabanjanam

13.10.2026 మంగళవారం, హైదరాబాద్

WWW.PRABANJANAM.COM




సూపర్

## ఎల్‌నినో ఎఫెక్ట్.. అప్రమత్తంగా ఉండాలి

- రైతులు వరి సాగు జోలికి వెళ్లకండి!
- ముందస్తు చర్యలతో 10 లక్షల ఎకరాల్లో తగ్గిన వరి సాగు
- తాగు, సాగునీటి సమస్యలపై జిల్లాల కలెక్టర్లతో భట్టి విక్రమార్క, తుమ్మల సమీక్ష

3



ఢిల్లీలో ఇండియా కూటమి

## భారీ ర్యాలీ

- ఓటర్ల జాబితాల సవరణపై నిరసన
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్
- సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష నేతల పాదయాత్ర
- అడ్డుకున్న పోలీసులు
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కాంగ్రెస్ న్యాయవాదుల బృందం

2



జంతర్ మంతర్‌లో

## ఇక నిరసనలకు తెర

- ఢిల్లీలో 3 కొత్త ప్రదేశాలు కేటాయింపు
- శాంతిభద్రతలే ప్రధాన సమస్య

9



ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి

## నోబెల్ పురస్కారం

- ఆర్థిక వ్యవస్థలో ఒడిదుడుకులను నియంత్రించే పరిశోధనలకు రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు గౌరవం

2



*వానాకాలం పంట సీజన్ ఇంకా పూర్తిగా ముగియనేలేదు.. ధాన్యం కల్లాలు దాటి.. మిల్లులకు చేరనే లేదు.. అప్పుడే దిగుబడి తగ్గింది.. బియ్యం దొరకవు అంటూ.. బ్లాక్ దందా మొదలు పెట్టారు. ఎల్‌నినో బూచి చూపి బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను అమాంతం పెంచేశారు. నిల్వలు సమృద్ధిగా ఉన్నా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి రోజురోజుకూ అడ్డగోలుగా ధరలు పెంచేస్తున్నారు. కిలో బియ్యం రూ.100కు చేరొచ్చంటూ ప్రభుత్వ పెద్దల చేసిన కామెంట్స్.. బ్లాక్ దందాకు ఊతమిస్తున్నాయి. గత రెండు సీజన్లలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చినా.. ఇప్పటికీ గోదాముల్లో లక్షల టన్నుల వడ్ల నిల్వలు ఉన్నా.. ఇప్పుడే బియ్యం అయిపోయినట్లు ధరలు పెంచేందుకు కృత్రిమ కరవు సృష్టిస్తున్నారు. రూ.4 వేలకు క్వింటాలు ఉన్న బియ్యం ధర.. ఒకేసారి రూ.10 వేలకు చేరితే, మరి రూ.2400 ఉన్న క్వింటాలు వడ్ల ధర ఎందుకు రూ.6 వేలు కావడం లేదు? బియ్యం ధర పెరుగుతుంటే.. రైతు పండించిన వడ్లకు మాత్రం అదే స్థాయిలో ధర ఎందుకు పెరగడం లేదు? ఈ బియ్యం బ్లాక్ దందా వెనుక ఉన్నది ఎవరు? లాభం ఎవరికి.. నష్టం ఎవరికి?*

# బియ్యం బ్లాక్ దందా!

## ఎల్‌నినో బూచి చూపి ధరల పెంపు!

### వానాకాలం పంట సీజన్ ముగియనే లేదు..

- ధాన్యం మిల్లులకు చేరనే లేదు.. అప్పుడే వ్యాపారుల మాయాజాలం
- బహిరంగ మార్కెట్‌లో రేట్లు పెంచుతున్న వ్యాపారులు
- బ్లాక్ దందాకు ఉతమిచ్చేలా ప్రభుత్వ పెద్దల కామెంట్స్
- కిలో బియ్యం రూ.100 అవుతుందని పరోక్షంగా వ్యాఖ్యలు
- ఇదే అదనుగా సన్నబియ్యం కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నం
- వానలు లేక.. సరిపడా ధాన్యం రాలేదని సాకులు చెబుతున్న మిల్లర్లు
- గత రెండు సీజన్లలో రికార్డు స్థాయిలో వచ్చిన ధాన్యం దిగుబడి
- ఇప్పటికీ వేల గోదాముల నిండా.. లక్షల టన్నుల వడ్ల బస్తాలు
- నాలుగు నెలలు వర్షా లు లేకపోతే.. బియ్యానికి కరవు వచ్చినట్లేనా?
- బియ్యానికి ధర పెరిగితే.. వడ్లకు రేటు ఎందుకు పెరగట్లేదు?

2




### ఏపీలో కిలో బియ్యం రూ.49

ప్రజలకు తక్కువ ధరకే బియ్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏపీలో కూటమి ప్రభుత్వం చేపట్టింది. సోమవారం భవానీపురం రైతు బజార్‌లో బియ్యం పంపిణీని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 151 రైతు బజార్లలో బీపీటీ సన్న రకం బియ్యం కేజీ రూ.49 చొప్పున 26 కేజీల బ్యాగ్‌లో ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలు ఎక్కువగా కోరుకునే నెల్లూరు కేఎన్ఎం వెరైటీ బియ్యం మార్కెట్లో రూ.85 ఉండగా, కేవలం రూ. 50 కే పౌరసరఫరాల శాఖ ద్వారా ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అందుబాటులో ఉంచామన్నారు. మార్కెట్లో రూ.50 వరకు ఉన్న గోధుమ పిండిని కేవలం రూ.25 కే వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. మరి తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు బియ్యం ధరలను నియంత్రించడం లేదు సరికదా? మిల్లర్లు, వ్యాపారులకు వత్తాసు పలికేలా కిలో బియ్యం రూ.100 కావొచ్చనే భయాందోళనలను పెంచుతున్నది.



## నా పేరు తొలగించండి

- ఏసీబీ కోర్టులో మాజీ మంత్రి కేటీఆర్ పిటిషన్
- నాంపల్లి ఏసీబీ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- కేటీఆర్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీ అధికారులకు కోర్టు ఆదేశం

**తెలంగాణ బ్యూరో, (ప్రభంజనం):** ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఫార్ములా ఈ రేస్ నిర్వహణలో నిధుల మళ్లింపు, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ చార్జిషీట్‌లో తనను ఏ1 నిందితుడిగా పేర్కొనడాన్ని కేటీఆర్ సవాల్ చేశారు. ఈ కేసుకు తనకు ఎలాంటి

• మిగతా 3లో..



జూబ్లీహిల్స్‌లో ముస్లిం జపం..

## ఇప్పుడు రాముడి పేరా?

- కాంగ్రెస్ నేతలు ఒసామా బిన్ లాడెన్ వారసులు
- రైతులు చస్తుంటే.. విమానాల్లో ఢిల్లీ పర్యటనలా?
- 6 గ్యారంటీలు అమలు చేయకపోతే రాహుల్‌ను తిరగనివ్వం
- సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు కౌంటర్

3



## ఎల్‌నినో తెలిసినా నిద్రపోయారా?

- ప్రజలకు నీళ్లివ్వరు కానీ.. బీరు కంపెనీలకు ఇస్తారా?
- రేవంత్ రెడ్డి వైఫల్యం వల్లే రాష్ట్రంలో విద్యుత్ కోతలు
- కరవుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అసలు కార్యాచరణే లేదు
- మాజీ మంత్రి హరీష్ రావు హాట్ కామెంట్స్

**హైదరాబాద్, (ప్రభంజనం):** ఎల్ నినో ఉందని ముందే తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు లిఫ్ట్ చేసి పెట్టుకోలేదని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. దేవాదుల, కల్వకుర్తిలో నీళ్లు లిఫ్ట్ చేసి ఉంటే కరువే ఉండేది కాదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎల్ నినో ఉందని ముందే తెలిసి మిగిలిన రాష్ట్రాలు విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విద్యుత్ ఒప్పందాలు చేసుకోలేదని..నిద్రపోయారా? అని..ఎల్ నినో ఉందని ముందే

• మిగతా 2లో..

## రేడియల్ రోడ్–2 టెండర్లలో భారీ అవినీతి



- రేవంత్ ప్రభుత్వ స్కాంలపై రాహుల్‌కి ఫిర్యాదు చేస్తా
- రేడియల్ రోడ్డు టెండర్లపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఫైర్
- సుశీ సంస్థ రూ. 600 కోట్లు తక్కువ బిడ్ చేసినా వేరే వాళ్లకు టెండర్లు ఇచ్చారు
- రేవంత్ కార్యాలయం నుంచి మా సంస్థకు ఫోన్ చేసి మరీ టెండర్ వేయొద్దని చెప్పారు
- నాగార్జున కన్‌స్ట్రక్షన్స్, బీవీఎస్ఆర్, జీకేసీ అనే 3 ఆంధ్రా కంపెనీలకే టెండర్లు ఇచ్చారు
- సుశీ ఇన్‌ఫ్రాకు టెండర్ ఇచ్చుంటే ప్రభుత్వానికి రూ. 600 కోట్లు ప్రజాధనం మిగిలేది
- తెలంగాణ ప్రజల సొమ్ము దోచుకునేందుకు, కమీషన్ల కోసమే మాకు టెండర్ ఇవ్వలేదు
- ఒక సంతకం లేదని మా టెండర్ రిజెక్ట్ చేశారు.. ఆ సంతకాన్ని తెచ్చిచ్చినా రిజెక్ట్ చేశారు
- అందుకే కోర్టులో పిటిషన్ వేశాము
- ప్రభుత్వం తరపున ముకుల్ రోహత్గీని నియమించారు
- సింగరేణిలో మూడేళ్లుగా అవినీతి జరుగుతోంది.. ఆ సంస్థ మూతపడే దుస్థితికి వచ్చింది
- రేడియల్ రోడ్డు స్కాంపై వెనక్కి తగ్గను.. అవసరమైతే సుప్రీంకోర్టుకి వెళ్తానని స్పష్టీకరణ
- రేవంత్ ప్రభుత్వంపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆరోపణలు

3



ఇది మరో స్వాతంత్ర్య

## పోరాటం

- జనాభా పెరుగుతుంటే.. ఓట్లు ఎలా తగ్గుతాయి?
- 'సైమన్ గో బ్యాక్' స్ఫూర్తితో 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం
- మైనారిటీ, దళిత, గిరిజన, పేదల ఓట్ల తొలగింపునకు యత్నం
- ఈడీ, సీబీఐ వైఫల్యంతోనే కొత్త డ్రామా ఆడుతున్నారు
- బీజేపీ సర్కార్ పై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు
- ఢిల్లీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం దిశానిర్దేశం

2

## గౌరమ్మ ఆశీస్సులతో ఆడబిడ్డలు సుఖంగా ఉండాలి

- తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో కవిత బతుకమ్మ సంబురాలు
- మహిళా నాయకులతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడిన : కవిత

**తెలంగాణ బ్యూరో, (ప్రభంజనం):** బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మహిళా నాయకులతో కలిసి బతుకమ్మ పేర్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ అందరితో పాటలు పాడిస్తూ బతుకమ్మలు పేర్చారు. ఈ సందర్భంగా బతుకమ్మ విశిష్టత, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఈ పండుగ ద్వారా మహిళలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి ఎంతలా కృషి చేశామో వివరించారు. అనంతరం గౌరమ్మకు పూజలు చేసి

• మిగతా 3లో..





# ఎల్‌నినో తెలిసినా నిద్రపోయారా?

**( మొదటిపేజీ తరువాయి )**

తెలిసినా బొగ్గు నిల్వలు ఎందుకు పెట్టుకోలేదు? అని హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వైఫల్యం వల్లనే రాష్ట్రంలో విద్యుత్ కోతల పరిస్థితి ఉందని, రైతుల కంటే ముఖ్యమైన అంశం ప్రభుత్వానికి ఏమి ఉంటుంది? అని ప్రశ్నించారు. సింగనూరు ప్రాజెక్టు మరమ్మత్తు చేస్తామని 29 టిఎంసిలు ఖాళీ చేశారని, సింగనూరు ప్రాజెక్టు నీళ్లు ఖాళీ చేసి మరమ్మత్తు చేయకుండా వదిలి పెట్టారని విమర్శించారు. హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు తాగునీరు ఎలా? అని..కోట్లమందికి తాగునీరిచ్చే సింగనూరు ప్రాజెక్టు పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారు? అని ప్రశ్నించారు. ప్రస్తుతం సింగనూరు ప్రాజెక్టులో 3 టిఎంసిలు మాత్రమే ఉన్నాయని, కేవలం 3 టిఎంసిలే ఉన్నా బీరు ఫ్యాక్టరీలకు నీళ్లిస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ..కోట్లమంది ప్రజలపై లేదని, లిక్కర్ కంపెనీలకు నీటి కొరత రావొద్దని అబ్కారీ మంత్రి చెబుతున్నారని అన్నారు. రక్షణశాఖ కంపెనీలు, ఐఐటికి తాగునీరు ఇవ్వలేమని చెబుతున్నారు? అని..తాగునీరు కొరత విషయంలో ప్రభుత్వానికి కార్యాచరణే లేదని హరీష్ రావు ధ్వజమెత్తారు. జూరాల గేట్లు ఎత్తిన రైతులపై కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారని తాగునీటికి బీరు కంపెనీలకు ఇస్తున్న తమర్ని ఏం చేయాలి? అని నిలదీశారు. రైతుబీమా రాక 3వేల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.

# బియ్యం బ్లాక్ దందా!

**తెలంగాణ బ్యూరో: (ప్రభంజనం )**

తెలంగాణ రాష్ట్రంలో ఎల్ నినో బూచి చూపి.. బియ్యం కృత్రిమ కొరత సృష్టించి ధరలు అమాంతం పెంచేస్తున్నారు కొందరు వ్యాపారులు. ఈసారి సాధారణంగా కురవాల్సిన 740 మి.మీ. వర్షపాతానికి గాను కేవలం 615 మి.మీ. మాత్రమే పడింది. ఈ17 శాతం వర్షపాత లోటు కారణంగా రాష్ట్రంలో వరి సాగు తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి దాదాపు 12 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గినట్లు అంచనా. వరి సాగు విస్తీర్ణం, దిగుబడులు తగ్గిందన్న సాకుతో.. బియ్యం ఉత్పత్తి తగ్గుతుందని, సప్లయ్ తగ్గుతుంది కాబట్టి డిమాండ్ పెరుగుతుందని ధరలు అడ్డగోలుగా పెంచేస్తున్నారు. ధరల స్థిరీకరణకు కృషి, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాల్సిన ప్రభుత్వ పెద్దలే.. కిలో బియ్యం రూ.100 కావొచ్చని ఆందోళన వ్యక్తం చేయడం.. బ్లాక్ మార్కెట్ దందాకు మరింత ఊతమిస్తున్నట్లు అయింది. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం జూలై నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలోనే తెలంగాణలో సన్న బియ్యం ధరలు 13.32 శాతం పెరిగాయి. ఈ నెల రోజుల్లో మరో 20 శాతం వరకు ధరలు పెరిగినట్లు అంచనా. ఇది దేశంలోనే రెండో అత్యధిక పెంపు కావడం గమనార్హం. భవిష్యత్తులో బియ్యం కొరత వస్తుందని వ్యాపారులు, దళారులు సృష్టించిన భయంతో వినియోగదారులు ముందస్తుగా నిల్వ చేసుకోవడం కూడా సన్న బియ్యానికి డిమాండ్, ధరలు పెరగడానికి కారణమవుతోంది.

**బియ్యం నిల్వలు ఉన్నా..**

2025 వానాకాలంలో తెలంగాణలో సుమారు 67 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగగా, ప్రభుత్వ అంచనాల ప్రకారం 1.48 కోట్ల నుంచి 1.60 కోట్ల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం ఉత్పత్తి అయింది. 2025-26 యాసంగిలోనూ 65.91 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగగా, సుమారు 140.81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అంటే వరుసగా రెండు సీజన్లలోనూ రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి భారీ స్థాయిలోనే నమోదైంది. అయితే 2026 వానాకాలంలో వరి సాగు విస్తీర్ణం 57.70 లక్షల ఎకరాలకు తగ్గింది. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం ఈ సీజన్‌లో 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. గత వానాకాలంతో పోలిస్తే దాదాపు 9 నుంచి 12 లక్షల ఎకరాల సాగు తగ్గడంతో పాటు, ఉత్పత్తి కూడా సుమారు 28 నుంచి 35 లక్షల మెట్రిక్ టన్నుల మేర తగ్గే పరిస్థితి కనిపిస్తోంది. ఈ అంచనా ప్రకారం తగ్గిన ధాన్యం దిగుబడి 35 లక్షల టన్నులే.. కానీ బియ్యం ధరలు మాత్రం.. 50 శాతం వరకు పెంచేస్తున్నారు. ఇక్కడ కృత్రిమ కొరత సృష్టించి.. డబ్బులు దండుకునే పనిలో వ్యాపారులు, మిల్లర్లు ఉండగా, వారి వెనక నాయకులు కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



**ఇప్పటికే వ్యాపారులు క్వింటాలుకు దాదాపు రూ.600 నుండి రూ.800 వరకు బియ్యం ధరలు పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బియ్యం ధరలు పెంచడమే కాకుండా కొందరు వ్యాపారులు మార్కెట్లో కృతిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌరసరఫరా శాఖ అధికారులు దీనిపై దృష్టి పెట్టక పోతే రానున్న రోజుల్లో బియ్యం ధరలు భగ్గుమనడం ఖాయంగా కనిపిస్తుంది.**

**ఇతర రాష్ట్రాలకు ఎగుమతి..**

తెలంగాణలో పండే సన్నబియ్యం(ఆర్ఎన్ఆర్) రకానికి మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ పండే పంట ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. ప్రధానంగా కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, చత్తీస్ గఢ్ రాష్ట్రాలకు ఇక్కడి నుంచి ఎక్కువగా ఈ రకం బియ్యాన్ని వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు. దీంతో ఇక్కడ సన్నబియ్యానికి డిమాండ్ ఏర్పడి, రేట్లు పెంచారనే ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం, కోదాడ, మిర్యాలగూడ ప్రాంత వ్యాపారుల ఆజమాయిషీలోనే బియ్యం రేట్ల నిర్ణయం ఉంటుందని తెలుస్తోంది. వ్యాపారుల కృత్రిమ కొరత వల్ల.. రిటైల్ మార్కెట్లలో సన్నబియ్యం ధరలు ఒక్కసారిగా దూసుకెళ్లి కిలో రూ.85 నుంచి రూ.90 వరకు పలుకుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే కొన్ని రోజుల్లోనే సన్నబియ్యం ధర కేజీకి రూ.100 మార్కును తాకే అవకాశం ఉందని సమాచారం. గడిచిన 30 నుంచి 45 రోజుల వ్యవధిలోనే 25 కిలోల సన్నబియ్యం బస్తా ధరను ఏకంగా.. రూ.500 వరకు పెంచేశారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని.. రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని బియ్యం వ్యాపారులేను జనాలను బెంబేలెత్తిస్తున్న పరిస్థితి. పది నెలలుగా సన్నబియ్యం ధరలను పరిశీలిస్తే, ప్రజల గుండె గుభేలుమంటోంది. గతేడాది నవంబర్‌లో కింటా బియ్యం ధర రూ. 4,400 ఉండగా.. ప్రస్తుతం సెప్టెంబర్ లో రూ. 7వేల ధర పలుకుతోంది. ఈ రేట్లు కేవలం హోల్‌సెల్ వ్యాపారులకు మాత్రమే. వారికి హమాలీ, రవాణా ఖర్చుతో క్వింటాకు మరో రూ. 200 వరకు పెరుగుతుంది. ఈ లెక్కన ప్రజలకు రూ. 7,100 నుంచి రూ.7,300 వరకు బియ్యం విక్రయిస్తున్నారు.

**వరి ధాన్యానికి ధర ఏది?**

గతేడాది నవంబర్‌లో కింటా బియ్యం ధర రూ. 4,400 ఉంది. అప్పుడు క్వింటాలు ధాన్యం ధర రూ.2460. రూ. 4,400గా ఉన్న క్వింటాలు బియ్యం.. రూ.7,300 వరకు పెరిగితే.. మరి క్వింటాలు వడ్లకు కూడా కనీసం రూ.3500 దాటాలి కదా? మరి ఎందుకు ఆ ధరలకు కొనడం లేదు? బియ్యం ధరలు అమాంతం పెంచుతున్న మిల్లర్లు..ధాన్యం ధరలు ఎందుకు పెంచి రైతుల నుంచి కొనడం లేదు? ఇంకా రూ.2500కే ఎందుకు కొనగోలు చేస్తున్నారు. మొత్తం గమనిస్తే.. ధాన్యం ధర 10 శాతం కూడా పెరగలేదు.. కానీ బియ్యం ధరలను ఏకంగా 40 శాతం వరకు పెంచేశారు. వచ్చే ఏడాది బియ్యమే దొరకవు అనేలా పుకార్లు పుట్టిస్తూ.. ప్రజల భయాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. బ్లాక్ మార్కెట్ దందాను నియంత్రించాల్సిన సర్కారు పెద్దలు.. పాలన గాలికొదిలి.. నిద్రపోతున్న తీరు విస్మయం కలిగిస్తోంది.



# ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్ పురస్కారం

**ఇంటర్నేషనల్ డెస్క్: ( ప్రభంజనం )**

ఆర్థిక శాస్త్రంలో విశేష పరిశోధనలు చేసిన అమెరికాకు చెందిన ఇద్దరు ప్రముఖ ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ 2026 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆర్థిక వ్యవస్థలో ఒడిదుడుకులను తగ్గించి, స్థిరత్వాన్ని సాధించేందుకు ఉపయోగపడే విధానాలకు సూక్ష్మ ఆర్థిక శాస్త్ర పునాదులను అభివృద్ధి చేసినందుకు వీరిని ఈ పురస్కారం వరించింది. స్వీడన్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది.

**ఆర్థిక స్థిరత్వానికి దోహదపడిన పరిశోధనలు**

ప్రపంచవ్యాప్తంగా దేశాలు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం, ఇంధన ధరల పెరుగుదల వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు తీసుకునే నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. ఈ నిర్ణయాలు మరింత సమర్థంగా ఉండేందుకు వీలుగా ఆర్థిక వ్యవస్థలోని వ్యక్తులు, కుటుంబాలు, సంస్థల నిర్ణయాలు మొత్తం ఆర్థిక పరిస్థితులను ఎలా ప్రభావితం చేస్తాయో వివరించే నమూనాలను అభివృద్ధి చేయడంలో హాల్, వుడ్‌ఫోర్డ్ పరిశోధనలు కీలక పాత్ర పోషించాయి. వీరి పరిశోధనల ప్రధాన లక్ష్యం ఆర్థిక వ్యవస్థలో ఏర్పడే గరిష్ఠ స్థాయిలు, క్షీణతలను నియంత్రించేందుకు అనువైన విధానాలను రూపొందించడానికి బలమైన సైద్ధాంతిక పునాదులను అందించడం. సరైన సమయంలో ద్రవ్య, ఆర్థిక విధానాలను అమలు చేయడం ద్వారా ఆర్థిక ఒడిదుడుకుల తీవ్రతను తగ్గించవచ్చని వీరి కృషి స్పష్టం చేసింది.

**రాబర్ట్ ఈ. హాల్ పరిశోధనలు**

రాబర్ట్ ఈ. హాల్ అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త. కుటుంబాల వినియోగ వ్యయం, ఆదాయంపై అంచనాలు, ఉపాధి, ఆర్థిక కార్యకలాపాల మధ్య సంబంధాలపై ఆయన పరిశోధనలు చేశారు. ప్రజలు తమ ప్రస్తుత ఆదాయాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని ఖర్చులు చేయరని, భవిష్యత్తులో తమ ఆదాయం ఎలా ఉండబోతోందనే అంచనాలు కూడా వినియోగ నిర్ణయాలను ప్రభావితం చేస్తాయని ఆయన పరిశోధనలు ఆర్థికవేత్తలకు అర్థం చేసుకోవడంలో సహాయపడ్డాయి.

**మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కృషి**

మైఖేల్ వుడ్‌ఫోర్డ్ అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో రాజకీయ ఆర్థిక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ద్రవ్య విధానం, వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణంపై ప్రజల అంచనాలు, కేంద్ర బ్యాంకుల నిర్ణయాల ప్రభావం వంటి అంశాలపై ఆయన పరిశోధనలు చేశారు. వడ్డీ రేట్లను నిర్ణయించేటప్పుడు కేంద్ర బ్యాంకులు తీసుకునే నిర్ణయాలతో పాటు, భవిష్యత్తులో వడ్డీ రేట్లు ఎలా ఉండవచ్చనే ప్రజల అంచనాలు కూడా ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తాయని ఆయన పరిశోధనలు వివరించాయి. కేంద్ర బ్యాంకులు తమ విధానాలను స్పష్టంగా ప్రకటించడం, ప్రజల్లో విశ్వసనీయతను పెంపొందించడం ద్రవ్యోల్బణ నియంత్రణలో ముఖ్యమని ఆయన కృషి తెలియజేసింది. వుడ్‌ఫోర్డ్ అభివృద్ధి చేసిన సిద్ధాంతపరమైన నమూనాలు ఆధునిక ద్రవ్య విధాన విశ్లేషణకు ప్రాధాన్యమైన పునాదులుగా నిలిచాయి. 2026 సంవత్సరానికి ఈ పురస్కారం కింద మొత్తం 1.2 కోట్ల స్వీడిష్ క్రోనాలు అందజేస్తారు. ఈ మొత్తాన్ని ఇద్దరు విజేతలు సమానంగా పంచుకుంటారు

# ఢిల్లీలో ఇండియా కూటమి భారీ ర్యాలీ



**న్యూఢిల్లీ, ( ప్రభంజనం ):**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓటర్ల పేర్ల తొలగింపు అంశాలపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో పలువురు ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా ఛలో ఢిల్లీ**

ఛలో ఢిల్లీ-మార్చ్ ఫర్ డెమోక్రసీ పేరుతో నిర్వహించిన ఈ ర్యాలీ కనాట్ ప్లేస్, బరాఖంబా రోడ్ పరిసర ప్రాంతాల నుంచి సుప్రీంకోర్టు దిశగా సాగింది. ర్యాలీ నేపథ్యంలో మధ్య ఢిల్లీలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. నిరసనకారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పలు ప్రాంతాల్లో రద్దీ ఏర్పడింది. ఓటర్ల జాబితాల సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతున్నాయన్నది ప్రతిపక్షాల ప్రధాన అభ్యంతరం. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం నిలిచేలా చర్యలు తీసుకోవాలని, ఓటు హక్కుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కూటమి నాయకులు కోరుతున్నారు. ఎన్నికల సంఘం పనితీరుపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల సవరణకు సంబంధించి తలెత్తిన వివాదంపై న్యాయపరమైన జోక్యం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ పోరాటం ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కుల పరిరక్షణకు సంబంధించినదని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం నాయకత్వంలో మార్పు, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రా కూడా ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ఇతర నిరసనకారులు సైతం ఉద్యమానికి మద్దతుగా తరలివచ్చారు.

**ఓటర్ల జాబితాల్లో కోట్లాది పేర్ల తొలగింపుపై వివాదం**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ ప్రక్రియలో 13 కోట్లకు పైగా పేర్లు తొలగించినట్లు తెలుస్తోంది.

**సుప్రీంకోర్టు వైపు పాదయాత్ర.. పోలీసుల అడ్డంకులు**

ర్యాలీలో పాల్గొన్న నాయకులు సుప్రీంకోర్టు వైపు కదలగా, భద్రతా కారణాలతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న వాహనాన్ని కూడా భగవాన్ దాస్ మార్గ్ వద్ద నిలిపివేశారు. నిరసన నేపథ్యంలో ఢిల్లీలోని ఆరు మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా మూసివేశారు. ట్రాఫిక్ మళ్లింపులు, భద్రతా ఆంక్షలు అమలు చేశారు. సాయంత్రం 5 గంటల తర్వాత సంబంధిత మెట్రో స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను తిరిగి తెరిచారు.

# ఇది మరో స్వాతంత్ర్య పోరాటం

**ఢిల్లీ, (ప్రభంజనం):**

దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బ్రిటీష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన కల్పించేందుకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం తెలిపారు. ఓటు బచావో.. దేశ్ బచావో ఆందోళనలో భాగంగా ఢిల్లీ తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని, ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని సీఎం అన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో లాలా లజపతిరాయ్, భగత్‌సింగ్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకుల త్యాగాలు చిరస్మరణీయమని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. 'సైమన్ గో బ్యాక్' ఉద్యమ సమయంలో లాలా లజపతిరాయ్ లాఠీచార్జీలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఎందరో నాయకుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని పేర్కొన్నారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలకు ఓటు అనే శక్తిమంతమైన ఆయుధాన్ని అందించిందన్నారు. రాజరిక, కుటుంబ పాలనలకు ముగింపు పలికి ప్రజల చేతిలో అధికారం పెట్టడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషించిందని సీఎం తెలిపారు. పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించడం ద్వారా అంబేద్కర్ సమానత్వానికి బాటలు వేశారని సీఎం కొనియాడారు.



**గతంలో ఓటు హక్కు కల్పించేందుకు ఎస్ఐఆర్..**

గతంలోనూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 1950లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు లేని వారికి ఓటు హక్కు కల్పించారని సీఎం గుర్తు చేశారు. దేశ విభజన సమయంలో ప్రజలు ఎక్కడ స్థిరపడ్డారు? ఎవరు ఏ ప్రాంతానికి వెళ్లారు? అనే వివరాలను గుర్తించాల్సిన అవసరం కూడా అప్పట్లో ఏర్పడిందని పేర్కొన్నారు. తర్వాత ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వాల కాలంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు. అయితే, గతంలో ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన వారిని చేర్చడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టేవారని అన్నారు. ఇప్పుడు మోదీ, అమిత్ షాల పాలనలో మాత్రం ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారి పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీఎం మండిపడ్డారు. గతంలో ఈ ప్రక్రియను ప్రజలకు మేలు చేసే చర్యగా చూశారని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తమ అధికారానికి అడ్డుగా ఉన్న రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ, నార్కోటిక్స్ విభాగం వంటి సంస్థలను ఉపయోగించుకుందని, ఇప్పుడు వాటితో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కష్టమవుతోందనే ఉద్దేశంతో ఎస్ఐఆర్‌ను తెరపైకి తెచ్చారని సీఎం విమర్శించారు. ఈసీఐ ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి మోదీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని నడిపిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అని అన్నారు. అలాంటి సంస్థను రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సీఎం హితవు పలికారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత దెబ్బతింటే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

**పారదర్శకత కోసమే నాడు ఎన్నికల సంఘంలో మార్పులు..**

గతంలో ఎన్నికల సంఘం ఒక్క కమిషనర్ నేతృత్వంలో పనిచేసేదని, అయితే, ఈ సంస్థలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రిగా పి.వి.నరసింహారావు ఉన్న సమయంలో ముగ్గురు కమిషనర్ల విధానాన్ని తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేవారని తెలిపారు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నేత భాగస్వామ్యంతో నియామక ప్రక్రియ సాగేదన్నారు. మోదీ ప్రభుత్వం 2023లో ఈ విధానాన్ని మార్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషనర్ల నియామక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చారని ఆరోపించారు. నిర్ణయాలను తమకు అనుకూలంగా తీసుకునేందుకే ఈ మార్పులు చేశారని సీఎం మండిపడ్డారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో నిష్పక్షపాతానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించే సమయంలోనే రాహుల్‌గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జ్ఞానేశ్‌తో ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల తొలగింపునకు అవకాశం కల్పిస్తున్నారని సీఎం ఆరోపించారు.

**దళితులు, గిరిజనులు, పేదల ఓట్లే లక్ష్యమా?..**

దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రజల ఓటు హక్కులను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశ యువత ఓట్లను తొలగించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని సీఎం మండిపడ్డారు. సోషల్ మీడియాలో బీజేపీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని లక్ష్యంగా చేసుకుని వారి ఓటు హక్కులను తొలగించే యోచనలో ఉందని సీఎం విమర్శించారు. ఈ ప్రమాదాన్ని తొలుత గుర్తించి దేశ ప్రజల దృష్టికి తీసుకొచ్చింది రాహుల్ గాంధీయేనని సీఎం వెల్లడించారు. మొదట్లో ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై తగినంతగా దృష్టి పెట్టలేదని, తాజా పరిణామాలతో పరిస్థితి తీవ్రత అందరికీ అర్థమవుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీలే కాకుండా అధికార పక్షంలో ఉన్నవారు కూడా ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి వంటి వారు ఈ అంశంపై గొంతెత్తడమే ఇందుకు సంకేతమని సీఎం వ్యాఖ్యానించారు.

**మోదీ, అమిత్ షాల మౌనం ఎందుకు?..**

జ్ఞానేశ్ కుమార్ నియామకంలో ఎలాంటి కుట్ర లేదని మోదీ, అమిత్ షాలు భావిస్తే, ఆయనను తొలగించాలనే డిమాండ్లపై ఎందుకు స్పందించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వారు ఎందుకు అండగా నిలుస్తున్నారో సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేపడితే ఎందుకు అడ్డుకుంటున్నారని, నిరసనలను ఎందుకు అణచివేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

# రేడియల్ రోడ్–2 టెండర్లలో భారీ అవినీతి

**తెలంగాణ బ్యూరో: ( ప్రభంజనం )**

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) చేపట్టిన రూ.3,296 కోట్ల విలువైన రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్లలో అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. తన కుటుంబానికి చెందిన సుశీ ఇన్‌ఫ్రా సంస్థ తక్కువ ధరకు బిడ్లు దాఖలు చేసినప్పటికీ, సాంకేతిక కారణాలతో అనర్హత వేటు వేసి ఇతర సంస్థలకు పనులు అప్పగించారని విమర్శించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని, అవసరమైతే సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు.





**రూ.600 కోట్ల ఆదా అయ్యేదన్న రాజగోపాల్‌రెడ్డి**

రేడియల్ రోడ్-2 ప్రాజెక్టులోని మూడు ప్యాకేజీలకు సంబంధించి తమ సంస్థ ఇతర బిడ్డర్లతో పోలిస్తే సుమారు రూ.600 కోట్లు తక్కువ వ్యయంతో పనులు చేపట్టేందుకు ముందుకొచ్చిందని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. అయినప్పటికీ తమ సంస్థను పక్కన పెట్టి ఇతర కాంట్రాక్టర్లకు పనులు కేటాయించారని ఆరోపించారు. ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం అప్పులు తెస్తున్న సమయంలో తక్కువ ధరకు పనులు చేపట్టేందుకు ముందుకొచ్చిన సంస్థను పక్కన పెట్టడం వల్ల ప్రజాధనానికి నష్టం జరుగుతుందని ఆయన విమర్శించారు. నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు అడిగితే ఇవ్వడం లేదని, మరోవైపు అధిక వ్యయంతో కాంట్రాక్టులు కేటాయిస్తున్నారని ఆరోపించారు. తమ సంస్థకు భారీ లాభాలు అవసరం లేదని, పనులు చేపట్టి కొంత లాభం వచ్చినా సరిపోతుందని ఆయన పేర్కొన్నారు.

**సీఎం కార్యాలయం నుంచి ఫోన్లు వచ్చాయంటూ ఆరోపణ**

రేడియల్ రోడ్-2 టెండర్లలో పాల్గొనవద్దంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తమకు ఫోన్లు వచ్చాయని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. అయినప్పటికీ తాము టెండర్లలో పాల్గొన్నామని తెలిపారు. తమ సంస్థను అనర్హంగా ప్రకటించడానికి బాధ్యులైన అధికారులు ఎవరని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలోనే అవకతవకలు జరుగుతున్నాయని ఆయన విమర్శలు చేశారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తానని, రాహుల్ గాంధీకి అన్ని వివరాలు తెలియజేస్తానని చెప్పారు.

**అసలు వివాదం ఏమిటి?**

హెచ్‌జీసీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న రేడియల్ రోడ్-2 ప్రాజెక్టు సుమారు 81.15 కిలోమీటర్ల పొడవుతో ప్రతిపాదించారు. కొత్వాల్‌గూడ (బుద్వేల్) వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నాచారం సమీపంలోని జాతీయ రహదారి-167ఎన్ వరకు ఈ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు.

**ఈ ప్రాజెక్టును మూడు ప్యాకేజీలుగా విభజించారు:**

**ప్యాకేజీ–1:** బుద్వేల్ నుంచి షాబాద్ వరకు 29.50 కిలోమీటర్లు.

**ప్యాకేజీ–2**: షాబాద్ నుంచి గూడూరు వరకు 27 కిలోమీటర్లు.

**ప్యాకేజీ–3:** గూడూరు నుంచి నాచారం వరకు 24.65 కిలోమీటర్లు.

ఈ పనుల కోసం సుశీ ఇన్‌ఫ్రా అండ్ మైనింగ్ లిమిటెడ్ కూడా బిడ్లు దాఖలు చేసింది. అయితే, అక్టోబర్ 7న ప్రకటించిన సాంకేతిక బిడ్ మూల్యాంకన ఫలితాల్లో ఆ సంస్థను అనర్హంగా ప్రకటించారు. అనుభవ ధ్రువీకరణ పత్రంపై సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్‌ఈ) కౌంటర్ సంతకం లేదనే కారణంతో తమ సంస్థను తప్పించారని కంపెనీ కోర్టులో పేర్కొంది. ఈ నిర్ణయం నిబంధనలకు విరుద్ధమని, తమ వాదన వినిపించేందుకు తగిన అవకాశం ఇవ్వలేదని సుశీ ఇన్‌ఫ్రా అభ్యంతరం వ్యక్తం చేసింది.

**హైకోర్టును ఆశ్రయించిన సుశీ ఇన్‌ఫ్రా**

టెండర్ల ప్రక్రియలో తమ సంస్థను అనర్హంగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ సుశీ ఇన్‌ఫ్రా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. అక్టోబర్ 7న వెలువడిన సాంకేతిక బిడ్ మూల్యాంకన నిర్ణయాన్ని రద్దు చేయాలని, తమ సంస్థను అర్హమైనదిగా పరిగణించి ఆర్థిక బిడ్‌ను పరిశీలించాలని కంపెనీ పిటిషన్‌లో కోరింది. అంతేకాకుండా, కేసు తేలే వరకు టెండర్లను ఖరారు చేయడం, లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ జారీ చేయడం లేదా ఇతర సంస్థలకు పనులు అప్పగించడాన్ని నిలిపివేయాలని అభ్యర్థించింది.

**సింగరేణిపైనా విమర్శలు**

రాజగోపాల్ రెడ్డి సింగరేణి సంస్థ పరిస్థితిపైనా వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, సింగరేణి తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోందని ఆరోపించారు. ప్రభుత్వంలో జరుగుతున్నాయని తాను భావిస్తున్న అవకతవకలపై కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే పోరాటం కొనసాగిస్తానని పేర్కొన్నారు.

**ఢిల్లీ కార్యక్రమానికి దూరం..**

కాంగ్రెస్ ముఖ్యనేతలు ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమానికి తాను దూరంగా ఉండటంపైనా రాజగోపాల్ రెడ్డి స్పందించారు. రాష్ట్రంలో ఈ తరహా అవకతవకలు జరుగుతున్నాయని తాను ఆరోపిస్తున్న సమయంలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనడం సముచితం కాదనే భావనతో వ్యాఖ్యానించారు. రాజగోపాల్ రెడ్డి గత కొంతకాలంగా మంత్రివర్గ విస్తరణ, తనకు మంత్రి పదవి దక్కకపోవడం వంటి అంశాలపై అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. తాజా టెండర్ల వివాదంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి మధ్య విభేదాలు మరింత బహిరంగంగా మారాయి. రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 ప్రాజెక్టు టెండర్లపై రాజగోపాల్ రెడ్డి చేసిన ఆరోపణలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదే వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా టెండర్ల పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తి, పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# జూబ్లీహిల్స్‌లో ముస్లిం జపం.. ఇప్పుడు రాముడి పేరా?

**తెలంగాణ బ్యూరో, (ప్రభంజనం):**

బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎన్. రామచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అవినీతిరహిత పాలన అందిస్తూ.. దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపిస్తోందని కొనియాడారు. 2014కు ముందు దేశంలో అనేక కుంభకోణాలు చూశామని, మోదీ ప్రధాని అయ్యాక దళారీ వ్యవస్థను అంతమొందించి లబ్ధిదారులకు నేరుగా ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. గడిచిన 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని, ఇందులో భాగంగానే రాష్ట్రంలోని 41 రైల్వే స్టేషన్లను ఆధునీకరించినట్లు చెప్పారు. రోడ్లు, రైల్వేలు, ఎయిర్ వేస్ రవాణా వ్యవస్థలు అద్భుతంగా రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. గోవాలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ రాముడు కాదని.. ఆ పార్టీ రావణుడు, రాక్షసుడు అవుతుందని మండిపడ్డారు కాంగ్రెస్ నేతలు ఒసామా బిన్ లాడెన్ వారసులు అంటూ ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో 'కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్ అని ప్రచారం చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు రాముడి పేరు ఎత్తడం విడ్డూరంగా ఉందన్నారు. హిందువుల



భావోద్వేగాలతో ఆడుకోవద్దని, దేవుళ్లను ఎగతాళి చేస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు ఆయనను తెలంగాణలో తిరగనివ్వమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులు కష్టాల్లో ఉండి ప్రాణాలు వదులుతుంటే, ముఖ్యమంత్రి , మంత్రులు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి వెళ్లడం శోచనీయమని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే 'ఫసల్ బీమా యోజన'ను అమలు చేసి రైతులను ఆదుకోవాలని, లేకపోతే బీజేపీ తరపున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా హైదరాబాద్ డ్రగ్స్‌కు కేంద్ర బిందువుగా మారుతోందని, రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ నేతలు ఇలాంటి రాజకీయ డ్రామాలుడుతున్నారని రామచందర్ రావు విమర్శించారు.

# నా పేరు తొలగించండి!

**( మొదటిపేజీ తరువాయి )**

సంబంధం లేదని తన పేరును ఈ జాబితాలో చేర్చారంటూ కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిందితుల జాబితా నుంచి తన పేరును పూర్తిగా తొలగించాలని కోర్టును కోరారు. కేటీఆర్ తరపున దాఖలైన ఈ డిశ్చార్జ్ పిటిషన్‌ను పరిశీలించిన నాంపల్లి ఏసీబీ కోర్టు, దీనిపై సమగ్ర కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీ అధికారులను ఆదేశించింది. అలాగే ఈ పిటిషన్‌కు సంబంధించి తదుపరి విచారణను ఈ నెల 30కి కోర్టు వాయిదా వేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈరేస్ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందనేది ప్రధాన ఆరోపణ. కేబినెట్ అనుమతి లేకుండానే రూ.55 కోట్ల ప్రభుత్వ నిధులను యూకేకు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ ఈఓ) సంస్థకు బదిలీ చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఏసీబీ దర్యాప్తు చేపట్టి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే ఈ ఆరోపణలను కేటీఆర్ పూర్తిగా తోసిపుచ్చారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ



కేసులను తెచ్చిందని విమర్శించారు. ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో గత ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌ను ప్రధాన నిందితుడిగా (ఏ1) పేర్కొన్నారు. ఈ కేసులో అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ (ఏ2), హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి (ఏ3)లతో పాటు క్రీడా కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర రావు (ఏ4), ఎఫ్ఈవో ప్రతినిధి అల్బెర్టో లాంగో (ఏ5)లను కూడా నిందితులుగా చేర్చారు.

# సైబర్ మోసగాళ్ల నయా స్ట్రాటజీ..

- **నో అంటే.. ఖాతా ఖాళీ!**
- **ఓటీపీలు అడగరు.. లింకులు నొక్కక్కర్లేదు!**
- **వాట్సాప్ సందేశంతోనే క్షణాల్లో సొమ్ము స్వాహా!**
- **ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్‌తో కేటుగాళ్ల సరికొత్త పన్నాగం**

**సిటీ క్రైమ్: ( ప్రభంజనం )**

సైబర్‌నేరగాళ్లపై నిరంతరం నిఘా ఉంచుతూ, విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ కేటుగాళ్లు ఆధునిక సాంకేతికతను ఆసరాగా చేసుకుని సరికొత్త మోసాలకు తెరతీస్తున్నారు. ఇప్పటివరకు గుర్తుతెలియని లింక్‌లపై క్లిక్ చేస్తేనో, ఎవరికైనా ఓటీపీలు పంచుకుంటేనో మాత్రమే ఖాతాల నుంచి నగదు మాయమయ్యేది. కానీ ఇప్పుడు కేటుగాళ్లు అంతకుమించిన సాంకేతిక ఎత్తుగడలతో అమాయకులను నిలువునా దోచుకుంటున్నారు. బాధితులు ఎవరితోనూ ఓటీపీలు పంచుకోకపోయినా, ఎలాంటి లింకులపై క్లిక్ చేయకపోయినా.. గుర్తుతెలియని నంబర్ నుంచి వాట్సాప్‌నకు వచ్చిన సందేశానికి కేవలం నో అని బదులిచ్చినందుకే జీవితకాల సంపాదనను క్షణాల్లో పోగొట్టుకుంటున్న సరికొత్త తరహా నేరాలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ వెల్లడించారు. ఈ కొత్త తరహా మోసం జరుగుతున్న తీరును ఆయన వివరిస్తూ.. మొదట గుర్తుతెలియని లేదా అంతర్జాతీయ నంబర్ల



నుంచి బాధితుల వాట్సాప్‌కు మీ బ్యాంక్ ఖాతా నుంచి కొంత నగదు డెబిట్ అయ్యింది అంటూ ఒక నకిలీ సందేశాన్ని పంపుతారని తెలిపారు. ఆ వెంటనే బాధితుల్లో భయాందోళనలు సృష్టిస్తూ.. ఈ లావాదేవీ మీరు చేయకపోతే వెంటనే నో అని రిప్లై ఇవ్వండి అంటూ రెండో సందేశాన్ని పంపిస్తారని పేర్కొన్నారు. అకౌంట్ నుంచి డబ్బులు పోయాయన్న కంగారుతో బాధితులు ఏమాత్రం ఆలోచించకుండా నో అని బదులివ్వగానే ఖాతాలోని డబ్బంతా క్షణాల వ్యవధిలో మాయమవుతోందని తెలిపారు. దీనిని సాంకేతికంగా 'ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్' అంటారని, సదరు సందేశంలో కనిపించకుండా దాగి ఉండే హిడెన్ లింక్స్, మాల్‌వేర్ స్క్రిప్ట్‌లు నో అని రిప్లై ఇచ్చిన వెంటనే వాటంతట అవే యాక్టివేట్ అయి, బాధితుల మొబైల్ ఫోన్లపై హ్యాకర్లకు పూర్తి నియంత్రణ లభిస్తుందని వివరించారు. ఇటీవల ఈ తరహాలో ఒక చార్టర్డ్ అకౌంటెంట్ బ్యాంకు ఖాతా నుంచి లక్షల్లో డబ్బును మాయం చేశారని తెలిపారు. ఈ కొత్త తరహా ముప్పు నుంచి తప్పించుకోవడానికి ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ పిలుపునిచ్చారు.

# సూపర్ ఎల్‌నినో ఎఫెక్ట్.. అప్రమత్తంగా ఉండాలి





- **రైతులు వరి సాగు జోలికి వెళ్లకండి!**
- **ముందస్తు చర్యలతో 10 లక్షల ఎకరాల్లో తగ్గిన వరి సాగు**
- **పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలి**
- **జూన్ వరకు తాగునీటికే తొలి ప్రాధాన్యత**
- **ప్రపంచవ్యాప్తంగా తలెత్తుతున్న సాగునీరు, విద్యుత్ సమస్యలు**
- **తాగు, సాగునీటి సమస్యలపై జిల్లాల కలెక్టర్లతో భట్టి విక్రమార్క, తుమ్మల సమీక్ష**

**తెలంగాణ బ్యూరో, (ప్రభంజనం):**

సూపర్ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందని, అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తే పరిస్థితులు ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం, భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులతో మాట్లాడి, యాసంగి 2026-27 పంటల సాగు ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడం, సాగునీటి లభ్యత పరిమితంగా ఉండటంతో రైతులు యాసంగి 2026-27 పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో సాగుకు దూరంగా ఉండాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాదని, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతోందని తెలిపారు. అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ లభ్యతకు సంబంధించిన సమస్యలు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వాస్తవాలను అర్థం చేసుకుని, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితిని బట్టి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సాగునీరు అందుబాటులో ఉంటుందనే అంచనాతో అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేసి నష్టపోకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ, రానున్న జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాగునీటి పథకాల్లో సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సాగునీటి లభ్యత తక్కువగా ఉండటంతో పాటు భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రైతులు సాగు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలను పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కష్టకాలంలో మనుషుల అవసరాలతో పాటు పశుసంపదను కూడా రక్షించుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పశువులకు తగినంత తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు ఏర్పాటు చేయడంతో పాటు మేత కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కోవడం ఒక్క శాఖతో సాధ్యం కాదని, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కష్టకాలంలో అధికారులకు సహకరించాలని, వారు అందించే సూచనలు, సలహాలను పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరి నుంచే రైతులకు అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ముందస్తు అవగాహన, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం చేసిన ప్రయత్నాల ఫలితంగా సుమారు 10 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గిందని, మహబూబ్‌నగర్ ప్రాంతంలో కూరగాయల సాగు పెరిగిందని వివరించారు. యాసంగిలో అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుపై రైతులు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వరి పంటకు అధిక ధర లభిస్తోందనే ఆశతో సాగు చేస్తే, నీటి కొరత కారణంగా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతుల వినియోగాన్ని పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రైతులు తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని నమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సూచనలు, అందుబాటులో ఉన్న నీటి వివరాల ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో యూరియా, విత్తనాల లభ్యతకు ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పంటలకు నీటి సరఫరా, విద్యుత్ లభ్యతపై అధికారులు రైతులకు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సమాచారం అందించాలని సూచించారు. ఏ ప్రాంతంలో ఎంత నీరు అందుబాటులో ఉంది, ఎంత విద్యుత్ సరఫరా చేయగలమనే వివరాలను స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా పాత తాగునీటి పథకాలను మరమ్మతులు చేసి పునరుద్ధరించాలని, మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా ప్రజలకు ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు థర్మల్ విద్యుత్ కేంద్రాలు గరిష్ట సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, సౌర విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచాలని సూచించారు.

# గౌరమ్మ ఆశీస్సులతో ఆడబిడ్డలు సుఖంగా ఉండాలి

**( మొదటిపేజీ తరువాయి )**

మహిళా నాయకులతో కలిసి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ వేడుకలతో తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.

**రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు..**

మహిళలు, బహుజనుల కోసం పాటు పడుతున్న తనను ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రజలకు



కవిత విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ సంబురాల సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళా నాయకత్వాన్ని పెంపొందించడానికి తాను కృషి చేస్తున్నానని తెలిపారు. ఇతర రాజకీయ పార్టీలు ఎలా ఉన్నా.. రిజర్వేషన్లు అమలు చేసినా, చేయకున్నా తమ పార్టీ రిజర్వేషన్లతో సంబంధం లేకుండా 50 శాతం సీట్లను మహిళలకు ఇస్తుందని ప్రకటించారు. రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత పార్టీ ఆఫీస్ లో బతుకమ్మ సంబురాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రపంచంలో ఎవరికీ లేని అత్యంత విశిష్టమైన బతుకమ్మ పండుగ మన తెలంగాణ సొంతమని అన్నారు. ప్రపంచానికి చాటేలా ఈ పండుగను జరుపుకుందామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ బతుకమ్మ పాటలు నేర్చుకొని భవిష్యత్ తరాలకు అందజేయాలని సూచించారు. బతుకమ్మ పండుగ అంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. ఆరోజు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి బతుకమ్మ ప్రతీకగా నిలిచిందని గుర్తు చేశారు.

## OPEN voice



# నెరవేరని ఆశలా.. దళితుల సంక్షేమం

తెలంగాణలో దళితుల ఆర్థిక, సామాజిక సాధికారత లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన దళిత బంధు పథకం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. బ్యాంకు రుణంతో సంబంధం లేకుండా రూ.10 లక్షల వరకు 100 శాతం గ్రాంట్‌గా అందించి, దళిత కుటుంబాలు తమకు నచ్చిన ఉపాధి, వ్యాపార మార్గాలను ఎంచుకునే అవకాశం కల్పించడం ఈ పథకంలోని ప్రధాన ఉద్దేశం. పథకం అమలు విషయంలో ఎంపిక, విడతల వారీగా నిధుల విడుదల వంటి అంశాలపై అప్పట్లో విమర్శలు, నిరసనలు వచ్చినప్పటికీ, దళిత కుటుంబాలకు ఒకేసారి పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందించే ప్రయత్నంగా దళిత బంధు ప్రత్యేక గుర్తింపు పొందింది. అయితే, పథకం పూర్తి స్థాయిలో ప్రతి దళిత కుటుంబానికీ చేరిందా? ఎంపికలో పారదర్శకత ఉందా? లబ్ధిదారులు ఆర్థికంగా స్వావలంబన సాధించారా? అనే ప్రశ్నలకు సమగ్ర సమీక్ష ఇప్పటికీ అవసరమే.

తెలంగాణ ఉద్యమ కాలం నుంచి దళితుల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై కేసీఆర్ మాట్లాడిన అంశాలు, దళిత బంధు రూపకల్పనకు నేపథ్యంగా నిలిచాయని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, దళిత బంధు అమలులో రాజకీయ జోక్యం, గ్రామాలు, వర్గాల మధ్య అసమానతలు, లబ్ధిదారుల ఎంపికపై వచ్చిన ఆరోపణలు కూడా విస్మరించలేని అంశాలే. పథకం ఉద్దేశం ఎంత గొప్పదైనా, దాని అమలులో లోపాలు ఉంటే అవి కూడా చర్చకు రావాలి. దళిత సంక్షేమాన్ని రాజకీయ పార్టీల పరస్పర విమర్శలకు పరిమితం చేయకుండా, దళిత కుటుంబాల ఆర్థిక స్థితి వాస్తవంగా ఎంత మెరుగుపడిందనే దానినే కొలమానంగా తీసుకోవాలి. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రధాన ప్రశ్న 'అంబేద్కర్ అభయ హస్తం' హామీ చుట్టూనే ఉంది. ఎన్నికల ప్రచారంలో దళిత కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించింది. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు దాటుతున్నా ఈ హామీ అమలు విషయంలో స్పష్టమైన కార్యాచరణ, సమగ్ర మార్గదర్శకాలు, లబ్ధిదారులకు నిధుల పంపిణీ కనిపించకపోవడం సహజంగానే ప్రశ్నలకు తావిస్తోంది. రూ.10 లక్షల దళిత బంధును విమర్శించిన వారు రూ.12 లక్షల అంబేద్కర్ అభయహస్తం హామీని ఎప్పుడు అమలు చేస్తారు? అన్న ప్రశ్నకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

అదే సమయంలో దళిత సంక్షేమాన్ని కేవలం ఎన్నికల హామీలు, రాజకీయ నినాదాల స్థాయిలోనే ఉంచడం ప్రమాదకరం. గతంలో దళిత బంధు కోసం డిమాండ్ చేసిన రాజకీయ నాయకులు, సంఘాల ప్రతినిధులు ఇప్పుడు అంబేద్కర్ అభయహస్తం అమలుపై కూడా అదే స్థాయిలో ప్రశ్నించాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రజల హక్కుగా మారినప్పుడు, దాన్ని అమలు చేయాలని ప్రశ్నించడం ఏ పార్టీకి మద్దతు ఇవ్వడమో, వ్యతిరేకించడమో కాదు. ప్రభుత్వం ఏదైనా, దళితులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రజా ఒత్తిడి ఉండాల్సిందే. దళిత సంఘాలు కూడా రాజకీయ అనుబంధాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వాలను నిలదీయాల్సిన అవసరం ఉంది.

చివరికి దళితుల సంక్షేమం ఏ ఒక్క పార్టీకి చెందిన రాజకీయ ఆస్తి కాదు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన దళిత బంధు, కాంగ్రెస్ ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం.. రెండింటినీ ఒకే ప్రమాణంతో పరిశీలించాలి. దళిత కుటుంబాల జీవితాల్లో వాస్తవంగా ఎంత మార్పు వచ్చింది? హామీలు ఇచ్చి అమలు చేయకపోతే ఏ ప్రభుత్వాన్నైనా ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దళితుల ఓటును రాజకీయ పార్టీలు కేవలం వాగ్దానాలతో కాకుండా, గతంలో చేసిన పనులు, భవిష్యత్ కార్యాచరణ ఆధారంగా కోరుకోవాలి. దళితుల ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం, రాజకీయ సాధికారతే అసలు లక్ష్యం కావాలి. మాటలకంటే అమలు, హామీలకంటే ఫలితాలు. దళిత సంక్షేమానికి ఇదే అసలైన కొలమానం.



- గుండమల్ల సతీష్ కుమార్
94931 55522



ఏంజెలీనా జోలీని వివాహం చేసుకోవడమే తన జీవితంలో తాను చేసిన అతిపెద్ద పొరపాటు. ఈ విడాకుల వివాదం తన వ్యక్తిగత జీవితాన్నే కాకుండా ఆర్థికంగా కూడా కోలుకోలేని దెబ్బ తీసింది. ఈ సుదీర్ఘ న్యాయపోరాటం వల్ల నేను సంపా దించిన ఆస్తిలో సగం తుడిచిపెట్టుకుపోయింది అంతేకాకుండా, తన పిల్లలను తనపైకి రెచ్చగొట్టి, మానసికంగా దూరం చేశారు.. చివరకు పిల్లలు తమ పేరు చివర ఉన్న తన ఇంటిపేరు పిట్ ను కూడా తొలగించుకునేలా చేశారు. నేను పెళ్లి చేసుకోకుండా ఒంటరిగానే ఉండిపోవాల్సింది.

- ప్రముఖ హాలీవుడ్ నటుడు బ్రాడ్ పిట్

PRABANJANAM EDITORIAL

# తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఐదు దశాబ్దాల ప్రయాణం



- యేచన్ చంద్ర శేఖర్,
మాజీ రాష్ట్ర కార్యదర్శి
ది భారత్ స్కౌట్స్ & గైడ్స్,
తెలంగాణ, హైదరాబాద్




హైదరాబాద్- ఢిల్లీ మధ్య ప్రయాణించే తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌కు ఇది స్వర్ణోత్సవ సంవత్సరం. ఐదు దశాబ్దాల క్రితం ప్రారంభమైన ఈ రైలు కేవలం ఒక రవాణా సాధనం కాదు. తెలంగాణ ప్రజలకు దేశ రాజధానితో ఏర్పడిన ఒక కీలక రైలు వారధి. ఐదు దశాబ్దాల్లో లక్షలాది మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చిన ఈ రైలు, కాలంతో పాటు పేరు మార్చుకుంది, రూపు మార్చుకుంది, సాంకేతికంగా ఆధునీకరించబడింది. అయితే, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా దాని సేవలు అదే స్థాయిలో విస్తరించాయా? అన్నది మాత్రం ఆలోచించాల్సిన ప్రశ్న. 1976 అక్టోబర్ 3న అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, రైల్వే మంత్రి మధు దండావతే ఆధ్వర్యంలో హైదరాబాద్ - ఢిల్లీ మధ్య ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. అప్పట్లో ఇది ఆ మార్గంలో నడిచే అత్యంత వేగవంతమైన, ప్రతిష్ఠాత్మకమైన సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ఒకటి. ఆక్స్‌ఫర్డ్ నీలం, బంగారు రంగుల ప్రత్యేక అలంకరణతో రైల్వే అభిమానులు దీనిని ముద్దుగా 'బ్లూ బుల్లెట్' అని పిలిచేవారు. ప్రారంభ రోజుల్లో ఈ రైలు హైదరాబాద్ నుంచి ఉదయం బయలుదేరి, మరుసటి రోజు ఉదయం ఢిల్లీ చేరుకునేది. సింగిల్ లైన్ మార్గాలు, పాత సిగ్నలింగ్ వ్యవస్థ ఉన్న కాలంలోనే హైదరాబాద్ - ఢిల్లీ ప్రయాణాన్ని 23 గంటలలోపు పూర్తి చేసిన ఈ రైలు, అప్పటి రైల్వే వేగానికి ఒక ప్రతీకగా నిలిచింది.

**పేరు మారింది... ప్రయాణం కొనసాగింది**

2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ తర్వాత పరిస్థితులు మారాయి. హైదరాబాద్ నుంచి బయలుదేరి, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని ఒక్క ప్రాంతం గుండా కూడా ప్రయాణించని రైలుకు 'ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్' అనే పేరు కొనసాగించడం సముచితమేనా? అనే ప్రశ్న సహజంగానే తెరపైకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో ఈ రైలుకు తెలంగాణ పేరు పెట్టాలనే డిమాండ్ బలపడింది. అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి సహా పలువురు నాయకులు ఈ అంశాన్ని రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు, విశాఖపట్నం - న్యూఢిల్లీ మధ్య కొత్త ఏపీ ఎక్స్‌ప్రెస్ ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలు కూడా జరిగాయి. చివరకు 2015 నవంబర్ 15న ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ పేరు 'తెలంగాణ ఎక్స్‌ప్రెస్'గా మారింది. పేరు మార్పు కేవలం రైల్వే టైమ్‌టేబుల్‌లో జరిగిన మార్పు కాదు. కొత్త రాష్ట్రం తన భౌగోళిక, రాజకీయ గుర్తింపును రైల్వే వ్యవస్థలో కూడా నమోదు చేసుకున్న సందర్భంగా దీనిని చూడవచ్చు.

**రాష్ట్ర రాజధాని నుంచి దేశ రాజధానికి వారధి**

ప్రస్తుతం 12723/12724 నంబర్లతో నడిచే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ దక్కన్ నుంచి న్యూఢిల్లీ వరకు సుమారు 1,677 కిలోమీటర్ల ప్రయాణం చేస్తోంది. సుమారు 25 నుంచి 26 గంటల ప్రయాణంలో పలు ముఖ్యమైన స్టేషన్లలో ఆగుతుంది. సికింద్రాబాద్, కాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రపూర్, నాగ్‌పూర్, భోపాల్, ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా కాంట్, మథుర, బల్లభ్‌గఢ్, హజ్రత్ నిజాముద్దీన్ వంటి స్టేషన్లు ఈ రైలు ప్రయాణంలో కీలకమైన మైలురాళ్లు. అయితే ఇక్కడే ఒక ప్రశ్న. ఐదు దశాబ్దాలుగా ప్రయాణిస్తున్న ఈ రైలుకు ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా ఆగుదలలు నిర్ణయించబడ్డాయా? ప్రారంభమైనప్పుడు కాజీపేటలో మాత్రమే హాల్ట్ ఉండేది. తరువాత రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ వంటి ప్రాంతాలకు ఆగుదలలు పెరిగాయి. ఇప్పుడు పెద్దపల్లి జంక్షన్‌లో కూడా హాల్ట్ ఇవ్వాలని ప్రయాణికులు చాలాకాలంగా కోరుతున్నారు. పెద్దపల్లి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతానికి ఇలాంటి కీలక రైలుకు హాల్ట్ లేకపోవడం, రైల్వే ప్రణాళికల్లో ప్రయాణికుల స్థానిక అవసరాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారనే ప్రశ్నను లేవనెత్తుతోంది. ప్రయాణికుల డిమాండ్, ఆదాయ సామర్థ్యం, ప్రాంతీయ ప్రాధాన్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రైల్వే అధికారులు ఈ అంశాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉంది.

**బై వీక్లీ నుంచి రోజువారీ సేవ వరకు**

1976లో కేవలం 14 కోచ్‌లతో ప్రారంభమైన ఈ రైలు తొలినాళ్లలో పక్షం రోజులకొకసారి నడిచేది. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కోచ్‌ల సంఖ్యను 21కి పెంచారు. రెండు డీజిల్ లోకోమోటివ్‌లను కూడా ప్రవేశపెట్టారు. 1991లో ఈ రైలు రోజువారీ సేవగా మారింది. అనంతరం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కోచ్‌ల సంఖ్యను 24 వరకు పెంచారు. అంటే ఈ రైలు చరిత్రను పరిశీలిస్తే, ప్రయాణికుల ఆదరణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. అయితే ఒక ఆసక్తికరమైన విరుద్ధత కూడా కనిపిస్తుంది. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ రైలుకు మరిన్ని ఆగుదలలు వచ్చాయి. కానీ అదే సమయంలో ప్రయాణ సమయం కూడా పెరిగింది. ఒకప్పుడు 23 గంటలలోపు పూర్తయ్యే హైదరాబాద్ - ఢిల్లీ ప్రయాణం ఇప్పుడు సుమారు 26 గంటలకు పైగా పడుతోంది. ప్రయాణికులకు సౌకర్యం కోసం హాల్ట్‌లు పెరగడం అవసరమే. కానీ వేగవంతమైన రైలు సుదీర్ఘ ప్రయాణ సమయంతో నడవాల్సి రావడం కూడా అంతే పెద్ద సమస్య. సౌకర్యం, వేగం మధ్య సమతుల్యత సాధించాల్సిన బాధ్యత రైల్వే యంత్రాంగంపై ఉంది.

**సాంకేతికంగా ఆధునికం... కానీ వేగం ఎక్కడ?**

కాలంతో పాటు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ సాంకేతికంగా ఎన్నో మార్పులు చూసింది. డీజిల్ ఇంజిన్ల నుంచి పూర్తిస్థాయి విద్యుదీకరణకు మారింది. ఆధునిక డబ్ల్యూఏపీ ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లతో నడుస్తోంది. 2019 జూలై 15 నుంచి పాత ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఆధునిక ఎల్ హెచ్ బీ కోచ్‌లు ప్రవేశించాయి. మెరుగైన భద్రత, అధునాతన సస్పెన్షన్, డిస్క్ బ్రేకింగ్ వ్యవస్థలు, సెంటర్ బఫర్ కప్లర్స్ వంటి సాంకేతికతలు ప్రయాణాన్ని మరింత సురక్షితంగా మార్చాయి. రైల్వే సాంకేతికత ఇంతగా అభివృద్ధి చెందినా, ప్రయాణ సమయం మాత్రం ఎందుకు పెరిగింది? అన్న ప్రశ్నకు కేవలం కొత్త హాల్ట్‌లను కారణంగా చూపడం సరిపోదు. ట్రాక్ సామర్థ్యం, ఇతర రైళ్లకు ప్రాధాన్యత, రూట్ కంజెషన్, సిగ్నలింగ్, ఆపరేషనల్ షెడ్యూలింగ్ వంటి అంశాలపై కూడా సమగ్రంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**స్వర్ణోత్సవం... వేడుకలకే పరిమితం కాకూడదు**

తెలంగాణ ఎక్స్‌ప్రెస్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం దక్షిణ మధ్య రైల్వేకు గర్వకారణమే. దశాబ్దాలుగా ఈ రైలును నడిపించిన లోకో పైలట్లు, గార్డులు, టెక్నీషియన్లు, ట్రాక్‌మెన్, స్టేషన్ సిబ్బంది, నిర్వహణ సిబ్బంది సహా వేలాది మంది రైల్వే ఉద్యోగుల సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. అయితే స్వర్ణోత్సవం అంటే కేవలం వేడుకలు, అభినందనలు, స్మారక కార్యక్రమాలు మాత్రమే కాదు. ఐదు దశాబ్దాల సేవకు గుర్తుగా ప్రయాణికులకు కొత్త సౌకర్యాలు అందించడం కూడా ఉండాలి. పెద్దపల్లి హాల్ట్, ప్రయాణ సమయం తగ్గింపు, మెరుగైన ఆన్‌బోర్డ్ సౌకర్యాలు, స్టేషన్లలో ప్రయాణికుల సదుపాయాల పెంపు, సమయపాలనలో మెరుగుదల వంటి అంశాలపై రైల్వే అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన సమయం ఇది.

**దక్షిణ మధ్య రైల్వేకు ఆరు దశాబ్దాలు**

తెలంగాణ ఎక్స్‌ప్రెస్ స్వర్ణోత్సవం జరుగుతున్న వేళ, దక్షిణ మధ్య రైల్వే కూడా తన ఆరు దశాబ్దాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటోంది. 1966 అక్టోబర్ 2న భారతీయ రైల్వే 9వ జోన్‌గా దక్షిణ మధ్య రైల్వే ఏర్పడింది. సికింద్రాబాద్‌ను కేంద్రంగా చేసుకుని ప్రారంభమైన ఈ జోన్, కాలక్రమంలో పరిపాలనా మార్పులను చవిచూసింది. ప్రస్తుతం సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లతో తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది. ఈ ఆరు దశాబ్దాల్లో రైల్వే రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చినా, ప్రయాణికుల ప్రాథమిక సమస్యలు మాత్రం పూర్తిగా పరిష్కారం కాలేదన్నది వాస్తవం. వేగవంతమైన రైళ్లు కావాలి, సమయపాలన కావాలి, మరిన్ని హాల్ట్‌లు కావాలి, మెరుగైన స్టేషన్ సదుపాయాలు కావాలి అన్న డిమాండ్లు ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి.

**స్టేషన్లూ చరిత్రకు సాక్ష్యాలే**

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చరిత్ర కూడా తెలంగాణ రైల్వే ప్రయాణంలో ఒక ముఖ్యమైన అధ్యాయం. నిజాం గ్యారంటీడ్ స్టేట్ రైల్వే కాలంలో నిర్మించిన ఈ స్టేషన్ 1874 అక్టోబర్ 9న ప్రారంభమైంది. ప్రస్తుతం అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా సుమారు రూ.714.73 కోట్ల వ్యయంతో దీన్ని ఆధునిక ప్రపంచస్థాయి రవాణా కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్ 1916లో నిజాం కాలంలో నిర్మించబడిన మరో చారిత్రక కట్టడం. ఆసఫ్ జాహీ వాస్తుశిల్పానికి ప్రతీకగా నిలిచిన ఈ స్టేషన్ దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత ఆకర్షణీయమైన చారిత్రక స్టేషన్లలో ఒకటి. అలాగే హైదరాబాద్ దక్కన్, అంటే నాంపల్లి రైల్వే స్టేషన్ కూడా హైదరాబాద్ రైల్వే చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. నిజాం కాలం నాటి ఈ స్టేషన్ నగర రైల్వే అభివృద్ధికి సాక్ష్యంగా నిలుస్తోంది.

**రైల్వే చరిత్రలో ఒక పేరు... ప్రజల జ్ఞాపకాల్లో ఒక ప్రయాణం**

తెలంగాణ ఎక్స్‌ప్రెస్ కథ కేవలం ఒక రైలు కథ కాదు. ఇది మారుతున్న రాష్ట్రం కథ. మారుతున్న రైల్వే వ్యవస్థ కథ. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు సాగిన లక్షలాది కుటుంబాల ప్రయాణాల కథ. ఐదు దశాబ్దాల్లో పేరు మారింది, ఇంజిన్లు మారాయి, కోచ్‌లు మారాయి, స్టేషన్ల సంఖ్య పెరిగింది, సాంకేతికత మారింది. కానీ ప్రయాణికుల ఆశ మాత్రం మారలేదు. తక్కువ సమయంలో, సురక్షితంగా, సౌకర్యవంతంగా గమ్యస్థానానికి చేరుకోవాలి. అందుకే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ స్వర్ణోత్సవాన్ని ఒక చారిత్రక ఘట్టంగా గుర్తించడంతో పాటు, భవిష్యత్ ప్రయాణానికి కొత్త లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సిన సందర్భంగానూ చూడాలి. ఐదు దశాబ్దాల ప్రస్థానానికి ఘనత చేకూర్చే నిజమైన స్వర్ణోత్సవం, ప్రయాణికుల కోసం మరింత వేగవంతమైన, సమయపాలనతో కూడిన, సౌకర్యవంతమైన తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌ను అందించగలిగినప్పుడే సార్థకమవుతుంది.

# భారతదేశహితం కోసం త్యాగం చేసిన నివేదిత

ఐరోపా ఖండంలోని ఐర్లండ్ దేశంలో పుట్టిన మార్గరెట్ ఎలిజబెత్ హిందుమతాన్ని స్వీకరించి సోదరి నివేదితగా మారింది. 1867న ఉత్తర ఐర్లాండ్‌లోని దుంగన్నాన్ అనే పట్టణంలో జన్మించింది. జన్మత క్రైస్తవురాలు. 1884 లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టింది. 1895లో స్వామి వివేకానందను తొలిసారి కలిసింది. వివేకానందుడి స్ఫూర్తిదాయకమైన మాటలు ఆమెను ఎంతగానో ప్రభావితం చేశాయి. భారత్ గురించి, భారతీయ మహిళ గొప్పదనం గురించి తెలుసుకున్నారు. అయితే భారత్ లో మహిళకు విద్య అవసరమని గ్రహించారు. 1898, జనవరి 28న భారత భూమిపై (కలకత్తా) పాదం మోపారు. మార్చి 25న వివేకానందచే బ్రహ్మచర్య దీక్షను పొంది ... నివేదితగా నామకరణం చేయడం జరిగింది. నివేదిత అంటే నివేదించబడినది (సమర్పితమైనది) అని అర్థం.

**వివేకానందునితో పర్యటిస్తూ..**

అప్పటి నుండి వివేకానందునితో భారతదేశమంతా పర్యటించారు. 1898 నవంబర్ 13న మాతృదేవి శ్రీ శారదమాతచే పాఠశాల ప్రారంభించారు. 1899 లో వివేకానందుని ఆదేశాల మేరకు కలకత్తాలో ప్లేగువ్యాధి నిర్మూలనా కార్యక్రమాలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించారు. తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేశారు.తోటి మనుషులను కరుణతో చూడటమే భగవంతుడికి చేసే నిజమైన సేవ అని ఆమె గ్రహించింది. విద్యద్వారానే సాధికారతసాధ్యమని భావించి అందుకు పాటుపడ్డారు. వివేకుడిది, ఆమెది సోదరీ సోదర బంధం అనుకుంటారు కానీ కాదు. భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఆవపోసన పట్టిన ఆ కాషాయ జ్ఞానికి , నివేదితకూ ఉన్న బంధం తండ్రీబిడ్డల అనుబంధం. భారతీయ సమాజంలో తండ్రి తన బిడ్డను ఎలా కంటికిరెప్పలా కాపాడుకుంటాడో వివేకుడు ఆమెనలా కాపాడారు.

**దేశం కోసం త్యాగం..**

నివేదిత కూడా వివేకానందుడి వలెనే తక్కువ కాలమే జీవించారు. అయినా భారతజాతికి ఆమె ఇచ్చిన ప్రేరణ , చేసిన సేవ అమూల్యం, అనంతం. న్యూయార్క్, షికాగో వంటి నగరాల్లో భారత మహిళల ఔన్నత్యం, ఆచార వ్యవహారాల గురించి ప్రసంగాలు చేశారు. భారతీయతను నివేదిత పూర్తిగా ఆకలింపు చేసుకున్నారు. 1905 బెంగాల్ లో స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్నారు. 1906 లో తూర్పు బెంగాల్ లో కరువుకాటకాల నివారణకు తీవ్రంగా కృషి చేయడం జరిగింది. 1907 సెప్టెంబర్ నుండి 1909 జూలై వరకు పాశ్చాత్య దేశాల్లో పర్యటించారు. నివేదితకు డైరీ రాయడం ద్వారా తన ఆలోచనలను, అనుభవాలను గ్రంథస్థం చేసే అలవాటు ఉంది. ఈ పర్యటనల వివరాలను 'వివేకానంద స్వామితో చేసిన కొన్ని పర్యటనలు' అనే పుస్తకంలో నిక్షిప్తం చేశారు. ఈ పర్యటనలో అల్మోరా, పాట్నా, వారణాసి, లక్నో, తేరాయ్(బుద్ధుని జన్మప్రదేశం), నైనిటాల్, రావల్పిండి, బారాముల్లా, శ్రీనగర్, శంకరాచార్య పర్వతం, అమర్‌నాథ్ ఇలా యాత్రలు పూర్తిచేసి అక్టోబర్ 18న లాసూర నుండి కలకత్తా తిరిగి వచ్చారు. ఈ యాత్రలతో ఆయా స్థలాల చారిత్రిక విశేషాలు, ఆ స్థలాలతో ముడిపడి ఉన్న ధార్మిక కేంద్రాల ప్రాముఖ్యం సనాతనపు గొప్పతనం నివేదితకు అర్థమయ్యాయి. ఈ పర్యటన హిందూ ధర్మాన్నీ, భారతదేశాన్నీ ఆమెకు గాఢంగా ప్రేమించటం నేర్పాయి. కలకత్తా తిరిగి వస్తూనే కొన్ని నెలలపాటు శారదామాత ఇంటిలో గడిపారు. ఆ ఇంటిలో శారదామాత తోపాటు గోలాప్ మా, గోపాలేర్ మా, జ్యోగీన్ మా, లక్ష్మీ దీదీ వంటి మహిళలతో సాన్నిహిత్యం ఏర్పడింది. ప్రాచీన ఆధునిక భారతీయ మహిళల జీవనశైలి అర్థమైంది. పరిశీలన, లోతైన అధ్యయనం, చక్కని వక్తృత్వం, ఆమె విశిష్టగుణాలు. వివేకానందుని సోదర శిష్యుల ద్వారా హిందూధర్మం గురించి అనేక విషయాలు తెలుసు కున్నారు. 1910 జూన్ లో సుభాష్ చంద్రబోస్ కుటుంబ సభ్యులతో బదరీనాథ్ , కేదార్ నాథ్ తీర్థయాత్రలు చేయడం జరిగింది. 1911 అక్టోబర్ 13న డార్జిలింగ్ లో దేహ పరిత్యాగం చేయడం జరిగింది. ఈ విధంగా సోదరి నివేదిత తన జీవితాన్ని దేశం కోసం త్యాగం చేసిన ధన్యజీవి.

- పిన్నింటి బాలాజీ రావు
హనుమకొండ, 9866776286

రచయితలకు మనవి..
ప్రభంజనం ఎడిట్ పేజీ "ప్రజా గొంతుక"కు, సాహిత్య పేజీ "సాహితి"కి తమ రచనలు పంపగోరువారు ఈ క్రింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము.
రచనలు పంపాల్సిన చిరునామా..
WWW.PRABANJANAM.COM
WHATSAPP NO.
72859 59555




## గాయత్రీదేవి అలంకారంలో పర్వతవర్ధిని అమ్మవారు

**యాదగిరిగుట్ట (ప్రభంజనం):**
శ్రీదేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రెండో రోజు పర్వతవర్ధిని అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ప్రాతఃకాల పూజలు, అర్చనలు, పారాయణాలు, శ్రీదేవి మూలమంత్ర జపం నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీదేవికి చతుషష్టి ఉపచార పూజలు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.సాయంత్రం 7 గంటల నుంచి నవావరణ పూజలు, కుంకుమార్చనలు, మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి మూడు దరఖాస్తులు

**సిరికొండ : (ప్రభంజనం)**
మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం మూడు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో మహమ్మద్ రఫీ అహ్మద్ తెలిపారు. మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో అర్జీలు సమర్పించినట్లు పేర్కొన్నారు. వీటిలో హౌసింగ్, పోలీస్, రెవెన్యూ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు వచ్చినట్లు వివరించారు.ప్రజల నుంచి స్వీకరించిన మూడు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపించి



నట్లు ఎంపీడీవో వెల్లడించారు. ఆయా శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించననీ తెలిపారు.

## అక్టోబర్ 14న భారత్–వెస్టిండీస్ టీ20 మ్యాచ్

- **2200 మంది పోలీస్ లతో పటిష్ట బందోబస్తు**
- **408 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా: సీపీ సుమతి**

**ఉప్పల్, (ప్రభంజనం):**
భారత్-వెస్టిండీస్ టీ20 క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి తెలిపారు. ఈ నెల 14న జరగనున్న మ్యాచ్‌ను వీక్షించేందుకు సుమారు 40 వేల మంది ప్రేక్షకులు వచ్చే అవకాశం ఉండటంతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్ల వివరాలను ఆమె వెల్లడించారు.




**2,200 మంది పోలీసులతో బందోబస్తు**
మ్యాచ్ ప్రశాంతంగా జరిగేలా మొత్తం 2,200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నారు. ఇందులో ఐదుగురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలు, 15 మంది ఏసీపీలు, 50 మంది ఇన్‌స్పెక్టర్లు, 90 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు ఇతర పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. ఉప్పల్ డీసీపీ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. స్టేడియం పరిసరాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలపై 408 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచనున్నట్లు వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులను కూడా పరిశీలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తామని సీపీ తెలిపారు.



## ప్రజావాణికి 89 ఫిర్యాదులు.. సత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు

**నిజామాబాద్ ప్రతినిధి : (ప్రభంజనం)**
ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అందిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరిస్తూ మొత్తం 89 అర్జీలు సమర్పించారు.కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు అదనపు కలెక్టర్లు రాజా గౌడ్, వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్ తదితర అధికారులు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై దృష్టి సారించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటూ బాధితులకు సత్వర పరిష్కారం అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ డివిజన్ లో మౌళిక వసతుల కల్పనకు కృషి

- **రూ.3.94 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన**

**ఉప్పల్, (ప్రభంజనం):**
ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కుషాయిగూడ డివిజన్ లో వివిధ కాలనీల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, ఆర్‌సీసీ పైప్‌లైన్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా కాలనీల్లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడటంతో పాటు, స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన జీవన పరిస్థితులు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యల పరిష్కారం,



మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుదల, పైప్‌లైన్ సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరనుంది. ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, కాలనీల వారీగా అభివృద్ధి పనులు చేపడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి ఆలయంలో అద్వైత సంఘం కోటి నామార్చ

- **ఆహ్వాన యాత్ర కరపత్రాల పంపిణీ**
- **డిసెంబర్ 12న కోటి నామార్చన.. నవంబర్ 21 నుంచి**
- **తెలంగాణవ్యాప్తంగా రథయాత్ర**

**ఉప్పల్, ( ప్రభంజనం )**
రామంతాపూర్ కల్లాడి ఆదిశంకరాచార్య మఠం, ఉన్నికృష్ణన్ నంబూద్రి ఆధ్వర్యంలోని అద్వైత సంఘం నిర్వహించనున్న కోటి నామార్చన కార్యక్రమానికి సంబంధించి ఆహ్వాన యాత్ర రామంతపూర్ అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రారంభమైంది. డిసెంబర్ 12వ తేదీ, రెండో శనివారం కోటి నామార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భక్తులకు ఆహ్వానం పలికేందుకు నవంబర్ 21 నుంచి రథయాత్ర చేపట్టనున్నారు. ఈ రథయాత్రకు అంకురార్పణగా రామంతపూర్ అయ్యప్ప స్వామి ఆలయంలో కరపత్రాల పంపిణీతో ఆహ్వాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిసెంబర్ 12న నిర్వహించనున్న కోటి నామార్చన కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప స్వామి మాలధారణ చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. తెలంగాణవ్యాప్తంగా చేపట్టనున్న ఆహ్వాన యాత్ర ద్వారా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం గురించి భక్తులకు విస్తృతంగా తెలియజేయనున్నట్లు తెలిపారు.కల్లాడి ఆదిశంకరాచార్య మఠం సభ్యులతో కలిసి రామంతపూర్ ఆలయ సభ్యులు విక్రంరెడ్డి, ఉమాకాంత్, మురళీధర్ గురుస్వామి ఫణికుమార్, ప్రహ్లాద్, ఎం. రాజేష్ ప్రజాపతి, రాజిరెడ్డి, రేవు నరసింహ, నగేష్ గుప్తా, అరుణ్ సాయి, రాము తదితర గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.




## ఓయూలో 'రుద్రం' కలరి ప్రదర్శన

- **మహిళల్లో ఆత్మరక్షణపై అవగాహన పెంపే లక్ష్యం: షర్మిల రాఘవ**

**ఉస్మానియా యూనివర్సిటీ , (ప్రభంజనం):**
ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో 'రుద్రం' పేరుతో భారతీయ సంప్రదాయ యుద్ధకళ కలరిపయట్టు ప్రదర్శన నిర్వహించడం గొప్ప అవకాశమని 'రుద్రం' వ్యవస్థాపక అధ్యక్షురాలు షర్మిల రాఘవ అన్నారు. ఆర్ట్స్ కళాశాల మహిళా సాధికారత విభాగం సహకారంతో ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. మహిళల్లో ఆత్మరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు భారతీయ సంప్రదాయ యుద్ధకళల గొప్పతనాన్ని చాటిచెప్పడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ స్వాతి, ప్రొఫెసర్ మాయాదేవి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు ఆత్మరక్షణలో నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి, భారతీయ యుద్ధకళలపై అవగాహన పెంచుకోవడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



## బుద్ధవనంలో ఈ నెల 14న దమ్మ విజయ వేడుకలు

**నల్గొండ ప్రతినిధి (ప్రభంజనం):**
నాగార్జునసాగర్‌లోని అంతర్జాతీయ పర్యాటక కేంద్రం బుద్ధవనంలో ఈ నెల 14న దమ్మ విజయ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి థాయిలాండ్ బౌద్ధ గురువు ఫా సాంగ్ సక్ కొవిడో, సంగారామ విహారానికి చెందిన సిద్ధార్థ బంతేజి, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అడప సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు. సామ్రాట్ అశోకుడు బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించిన సందర్భాన్ని, బాబాసాహెబ్ అంబేద్కర్ నాగ్‌పూర్‌లో బౌద్ధ ధమ్మ దీక్ష తీసుకున్న రోజును పురస్కరించుకుని ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బౌద్ధాభిమానులు, స్థానికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం...
## ఓల్డ్ బోయిన్ పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్

- **వీధి దీపాల సమస్యలకు పరిష్కారం...**

**బోయిన్ పల్లి ,(ప్రభంజనం)**
ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పనిచేయని వీధి దీపాలను సోమవారం మరమ్మతులు చేయించి, తిరిగి వెలిగేలా చర్యలు తీసుకున్న ఓల్డ్ బోయిన్ పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్..వీధి దీపాలు లేక మెయిన్ రోడ్ లలో, వీధుల లోప్రజలకు రాత్రివేళల్లో ఇబ్బందులు కలగకుండ, రహదారులపై తగిన వెలుతురు ఉండేలా వీధి దీపాల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు తెలపడం తో వెంటనే సంబంధిత అధికారుల తో మాట్లాడిన ముద్దం వెంటనే పరిష్కరించారు. పదవి లో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నామని మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు.






## యాదగిరిగుట్టలో ఘనంగా స్వాతి నక్షత్ర వేడుకలు

- **వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. గోవింద నామస్మరణతో గిరి ప్రదక్షిణ**

**యాదగిరిగుట్ట (ప్రభంజనం):**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు.అనంతరం కొండ కింద ఉన్న వైకుంఠ ద్వారం వద్ద ఆలయ ఈఓ భవానీ శంకర్ ఐఏఎస్ అధికారి ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా వేలాదిమంది భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది, అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

**నల్గొండ ప్రతినిధి (ప్రభంజనం):**

నాగార్జున సాగర్ ఎడమ కాలువకు తాగునీటి అవసరాల కోసం ఎన్నెస్పీ అధికారులు సోమవారం ఉదయం నీటిని విడుదల చేశారు. తొలుత 2 వేల క్యూసెక్కులు విడుదల చేసి, క్రమంగా 6 వేల క్యూసెక్కులకు పెంచనున్నట్లు తెలిపారు. గత నెలలో 20 రోజులకు పైగా నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపారు. అయితే ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఈసారి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయకపోవడంతో బోర్లు, బావుల ఆధారంగా సాగు చేసిన వరి పైర్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాలువకు నీరు విడుదల చేయడంతో మేజర్ కాలువలకు కూడా నీటిని వదులుతారా? లేదా? అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే విడుదల చేసిన నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. కాగా, సాగర్ జలాశయం పూర్తి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 534 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 188 టీఎంసీల నీరు నిల్వ ఉంది.




# ప్రజా ప్రయోజనాలను కాపాడేలా మీడియా ఉండాలి

**నల్గొండ ప్రతినిధి (ప్రభంజనం):**

ప్రజల పక్షాన నిలుస్తూ వారి మనోభావాలు, ప్రయోజనాలను ప్రతిబింబించేలా మీడియా పనిచేయాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాగార్జున సాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు కృత్రిమ మేధ, సామాజిక మాధ్యమాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల తర్వాత నాలుగో స్తంభంగా మీడియాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రజలకు సమాచారాన్ని అందించడం, చైతన్యం కల్పించడం మీడియా బాధ్యతని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని జర్నలిస్టులకు సూచించారు. జర్నలిజం చట్టాలు, మార్గదర్శకాలు, వర్కింగ్ జర్నలిస్టుల హక్కులు, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా మధ్య వ్యత్యాసాలను వివరించారు. కృత్రిమ మేధ, వాస్తవ నిర్ధారణపై సత్యప్రియ, సామాజిక మాధ్యమాలపై ముద్దం నరసింహస్వామి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకుడు యు. వెంకటేశ్వర్లు, జర్నలిస్టుల జిల్లా సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, చైర్మన్ ఓఎస్డీ రహమాన్, కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, పీఆర్వో శైలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అమీన్‌పూర్‌లో అభివృద్ధి పనులపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన

- **రూ.4.95 కోట్లతో చేపడుతున్న ఏడు పనుల పురోగతిపై సమీక్ష..**
- **గడువుకు ముందే పూర్తి చేయాలని ఆదేశం**

**పటాన్ చెరు: (ప్రభంజనం )**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్‌లో సోమవారం ఉదయం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. మొత్తం రూ.4.95 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఏడు అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్, అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో భాగంగా కాకతీయ నగర్‌లోని మహిళా భవన్ కమ్యూనిటీ హాల్, బీహెచ్‌ఈఎల్ మెట్రో ప్రాంతం, నరేంద్ర కాలనీ, దుర్గ ప్రావిన్స్ మార్గంలో నిర్మిస్తున్న స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను కమిషనర్ పరిశీలించారు. అలాగే బీరంగూడ, శ్రీవాణి నగర్ ప్రాంతాల్లో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. సన్‌వే ఓపస్-చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీ రోడ్డులో నిర్మిస్తున్న ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్ పనులను కూడా తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో పనుల ప్రస్తుత స్థితి, నిర్మాణ సమయంలో ఎదురవుతున్న సమస్యలు, పనుల పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కమిషనర్ మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, స్థానిక ప్రజల అవసరాలు, ఎదురవుతున్న సమస్యలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు కంటే ముందుగానే పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతతో పాటు పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పనులలో జాప్యానికి దారితీసే సమస్యలను గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించడం ద్వారా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. కమిషనర్ పర్యటనలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్స్ కు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు

- **రాజకీయం మాతో కాదు.. వైద్యం అందించడమే మా లక్ష్యం...**
- **సికింద్రాబాద్ ఆసుపత్రి ఏడాదిలోనే 15 వేల మందికి పైగా ఇన్‌పేషెంట్ సేవలు అందించింది...**
- **కావాలనే ప్రతికూల ప్రచారం చేస్తూ రోగుల్లో భయాందోళనలు సృష్టించడం సరికాదు .. మెడికవర్ హాస్పిటల్ ఆపరేషన్ చీఫ్ మహేష్ డెగ్లోర్కర్...**

**కంటోన్మెంట్,(ప్రభంజనం)**




మెడికవర్ హాస్పిటల్‌స్‌కు ఏ రాజకీయ పార్టీతోనూ ప్రత్యేక సంబంధం లేదని, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ మహేష్ డెగ్లోర్కర్ స్పష్టం చేశారు. వివిధ రాష్ట్రాల్లో, వేర్వేరు ప్రభుత్వాల హయాంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు మెడికవర్ ఆసుపత్రుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారని గుర్తుచేస్తూ, ఆసుపత్రికి రాజకీయ రంగు పులమడం సరికాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహేష్ డెగ్లోర్కర్ మాట్లాడుతూ.. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా కూడ మా ఆసుపత్రి ప్రారంభోత్సవం జరిగిందని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కూడ ఆసుపత్రి ప్రారంభోత్సవం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా, సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ , తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారని తెలిపారు. బేగంపేట ప్రాంతంలోని మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి అప్పటి మంత్రి హరీశ్ రావు హాజరయ్యారని, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కూడా మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన వివరించారు. తెలంగాణలో వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఆసుపత్రుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న విషయాలు మెడికవర్‌కు ఏ ఒక్క రాజకీయ పార్టీతోనూ ప్రత్యేక అనుబంధం లేదనే విషయాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణకే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ మెడికవర్ ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారని మహేష్ డెగ్లోర్కర్ తెలిపారు. మహారాష్ట్రలో ప్రముఖ రాజకీయ నాయకుడు శరద్ పవార్ , ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఏక్‌నాథ్ షిండే , దేవేంద్ర ఫడ్నవీస్ వంటి నాయకులు ఆసుపత్రుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు తమ హోదాల్లో ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకు హాజరు కావడాన్ని రాజకీయ అనుబంధంగా చిత్రీకరించడం సరికాదని అన్నారు. సికింద్రాబాద్ ఆసుపత్రి ప్రారంభమైన ఏడాదిలోనే 15 వేల మందికి పైగా ఇన్‌పేషెంట్లకు సేవలు అందించడం తమ వైద్య సేవలకు నిదర్శనమని మహేష్ డెగ్లోర్కర్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తీవ్రమైన, సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులు మెరుగైన చికిత్సపై ఆశతో ఆసుపత్రికి వస్తున్నారని పేర్కొన్నారు. ఇంతమంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్న సంస్థపై వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఉద్దేశపూర్వకంగా ప్రతికూల ప్రచారం చేయడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. మా దృష్టి రాజకీయాలపై కాదు.. రోగులకు మెరుగైన వైద్యం అందించడంపై నే అని మహేష్ డెగ్లోర్కర్ స్పష్టం చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితులు, వ్యాధి తీవ్రత, చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించకుండా కొన్ని యూట్యూబ్ ఛానెళ్లలో ప్రసారమవుతున్న కథనాలు ప్రజల్లో అపోహలు, భయాందోళనలు కలిగించే అవకాశం ఉందన్నారు. రోగుల మరణాలకు సంబంధించిన అంశాలపై పూర్తి వాస్తవాలు, వైద్యపరమైన వివరాల ఆధారంగా చర్చ జరగాలని, ధ్రువీకరించని సమాచారం ఆధారంగా ఆసుపత్రి ప్రతిష్ఠను దెబ్బతీయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఆసుపత్రిని లక్ష్యంగా చేసుకోవడం వల్ల రోగులు, వారి కుటుంబ సభ్యులు అనవసరమైన ఆందోళనకు గురవుతారని అన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ రాజకీయాలకు అతీతంగా వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని మహేష్ డెగ్లోర్కర్ స్పష్టం చేశారు. ఆసుపత్రిపై వచ్చే ఆరోపణలను వాస్తవాలు, ఆధారాల ఆధారంగా పరిశీలించాలని, ధ్రువీకరించని ప్రచారంతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించవద్దని ఆయన కోరారు.



# 10వ వార్డు నీటి సమస్యకు పరిష్కారం.. మినీ వాటర్ ట్యాంక్ ప్రారంభం

**సిరికొండ : (ప్రభంజనం)**

సిరికొండ గ్రామంలోని 10వ వార్డులో నెలకొన్న నీటి సమస్యను గుర్తించిన సర్పంచ్ మల్లెల సాయిచరణ్ వెంటనే స్పందించారు. వార్డు ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టించారు. నిర్మాణ పనులు పూర్తికావడంతో సోమవారం ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులతో కలిసి ట్యాంకును ప్రారంభించారు. దీంతో 10వ వార్డులో నీటి సరఫరాకు ఇబ్బందులు తగ్గుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శోభన్, అల్లిపురం కిషన్, ఎరుకల నరసయ్య, కనగందుల మురళి, ఇందూరి అమృత, కొలిపాక అశ్విని, బోడలత, కానపురం సునీత, అల్లిపురం శంకర్, నాయకులు రమేష్, బాలరాజు, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో నిజామాబాద్ జట్టుకు విజయం

- **తొర్లికొండలో ముగిసిన అండర్-13 బాలికల పోటీలు**

**జక్రాన్‌పల్లి : (ప్రభంజనం)**

జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర మినీ సబ్‌జూనియర్ అండర్13 బాలికల అంతర్‌జిల్లాల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సెమీఫైనల్‌లో 114 పరుగుల తేడాతో గెలిచిన నిజామాబాద్ జట్టు, ఫైనల్‌లో భద్రాద్రి కొత్తగూడెం జట్టుపై 80 పరుగుల తేడాతో విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం ద్వితీయ, వరంగల్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తొర్లికొండ సర్పంచ్ కాటిపల్లి పద్మ నాగరాజ్ విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓటమి ఎదురైనా నిరుత్సాహపడకుండా పట్టుదలతో సాధన కొనసాగించాలని క్రీడాకారిణులకు సూచించారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. తొలిసారిగా గ్రామంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జక్రాన్‌పల్లి మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూడెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి 31 వరకు మహారాష్ట్రలోని కోపర్గావ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించాలని ఆకాంక్షించారు. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సుద్దపల్లి సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థిని ఎన్. సమంతకు బెస్ట్ పిచర్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి కె. శోభన్ బాబు, బ్రాహ్మణపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి, ఉపసర్పంచ్ తెడ్డు మైపాల్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, జిల్లా పీఈటీ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. గంగాధర్, పంచాయతీ కార్యదర్శి వీరేందర్, ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.12.18 కోట్లతో కేంద్రీకృత వంటశాల నిర్మాణం

**యాదాద్రి భువనగిరి ప్రతినిధి (ప్రభంజనం):**



హరే కృష్ణ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని మూడున్నర లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, భోజనం అందిస్తున్నట్లు ఫౌండేషన్ ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు సత్యచంద్ర స్వామీజీ తెలిపారు. దివీస్ లేబొరేటరీస్ యాజమాన్యం అందించిన రూ.12.18 కోట్ల విరాళంతో జిల్లాలోని చౌటుప్పల్ శివారులో నిర్మించనున్న కేంద్రీకృత వంటశాలకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ వంటశాల ద్వారా జిల్లాలోని 966 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 72 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఏడాదిలో నిర్మాణం పూర్తి చేసి అల్పాహార సరఫరా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విరాళం అందించిన దివీస్ లేబొరేటరీస్ సీఎండీ దివి మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

**సిరికొండ/జగదాంబ తాండా : (ప్రభంజనం)**

సిరికొండ మండలం జగదాంబ తాండా గ్రామపంచాయతీ పరిధిలోని రూప్లా తాండాకు చెందిన మాలవత్ కళావతికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో సర్పంచ్ మాలవత్ సుగుణ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సూచనల మేరకు ఇంటి నిర్మాణ స్థలంలో ముగ్గు పోసి, కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుగుణ మాట్లాడుతూ పేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉపయోగపడుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫాష, కాంగ్రెస్ నాయకులు కిషన్, మోహన్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- **జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ ప్రతినిధి : (ప్రభంజనం)**



ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని, తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా అధిక లాభాలు పొందేలా రైతులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు నవీన్ తన అనుభవాలను పంచుకున్నారు. ఖరీఫ్‌లో వరికి బదులుగా కంది, పెసర, మినుము వంటి పప్పుదినుసులు సాగు చేసి లాభాలు పొందినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ విజయకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభంజనం



## బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

- మాట నిలబెట్టుకున్న బోర్డ్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్
- ఎంపీ ఈటలకు కృతజ్ఞతలు

**కంటోన్మెంట్,(ప్రభంజనం):**

కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని 6వ వార్డ్ టెంపుల్ రాక్ ఎంక్లేవ్ లో రూ.25లక్షల కంటోన్మెంట్ బోర్డ్ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.303 కోట్లతో రానున్న రోజులలో కంటోన్మెంట్ వ్యాప్తంగా బీటీ రోడ్లు, డ్రైనేజ్ ల నిర్మాణం, వీధి దీపాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సహకారంతో ముఖ్య సమస్యలపైన ప్రత్యేక దృష్టి సారించి వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎంపీ ఈటల వీడియో కాల్ ద్వారా వీక్షించి కాలనీ వాసులతో సంభాషించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ వార్డ్ అధ్యక్షులు ప్రతీక్ జైన్, బీజేపీ సీనియర్ నాయకులు బీఎన్ శ్రీనివాస్, బాణాల శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు, కాలనీ ప్రెసిడెంట్ మురుగేషన్, శ్రీనివాస్ గౌడ్, అమర్ షా, శశికాంత్, జలాన్, సదానంద రెడ్డి, నీలాన్, మోహియోద్దీన్, శ్రీనివాస్, చంద్రా రెడ్డి, శర్మ, ఉత్తమ్ చాంద్, రేవతి, వేణు గోపాల చారిలతో పాటు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సుల్లో కొనసాగుతున్న దసరా రద్దీ

- ప్రయాణికుల అవసరాలకు తగినట్లుగా అదనపు బస్సు సర్వీసులు
- ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి
- అధికారులకు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశాలు
- తొలి 3 రోజుల్లోనే కోటి నలభై లక్షల మంది ప్రయాణం

**సిటీ బ్యూరో: ( ప్రభంజనం )**



దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) నడుపుతున్న ప్రత్యేక బస్సు సర్వీసులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దసరా పండుగ రద్దీ నిర్వహణ, అదనపు బస్సుల ఆపరేషన్లపై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి సోమవారం అధికారులతో జూమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పండుగ వేళ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సర్వీసులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ దసరా పండుగ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ రికార్డు స్థాయిలో సర్వీసులను నడుపుతూ మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందిస్తుందని, గత ఏడాది (2025) దసరా తొలి మూడు రోజుల్లో 922 అదనపు బస్సులను నడపగా... ఈ ఏడాది అక్టోబర్ 9, 10, 11 తేదీలలో గతంతో పోలిస్తే 495 బస్సులు అదనంగా ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా దసరా పండుగ వేళ మహిళలకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూరుతోందని, గత ఏడాది దసరా సమయంలో రోజుకు సగటున రూ. 13.02 కోట్లు ఆదా కాగా, ఈ ఏడాది దసరా రద్దీ సమయంలో మహిళలు రోజుకు రూ. 13.73 కోట్ల మేర ఆదా చేసుకోగలిగారని అన్నారు. పండుగ ముందు రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వంత ఊర్లకు ప్రయాణమయ్యే వారి కోసం ఈ నెల 15, 16, 17 తేదీల్లో కూడా రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడపాలని అధికారులను ఎండీ వై. నాగిరెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్, ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చని, ఇతర వివరాలు, ప్రయాణ సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 04069440000, 04023450033 లలో సంప్రదించాలని సూచించారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలి
- ఢిల్లీ నిరసనలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**యాదగుగుట్ట (ప్రభంజనం):**

ఓట్ల చోరీ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు నిరసనలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఓటు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, దాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగినప్పుడే ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం కలుగుతుందని అన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## రోడ్లపై పంటలు ఆరబెట్టవద్దు: ఎస్ఐ మహేష్

**జక్రాన్‌పల్లి : (ప్రభంజనం)**



రహదారులపై మొక్కజొన్న, వరి ధాన్యం, ఇతర పంటలను ఆరబెట్టవద్దని జక్రాన్‌పల్లి ఎస్ఐ జి. మహేష్ రైతులకు సూచించారు. రోడ్లపై పంటలు ఆరబెట్టడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు కలగడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు తమ పంటలను సురక్షిత ప్రాంతాల్లోనే ఆరబెట్టాలని, రహదారులపై పంటలు ఆరబెట్టి ప్రమాదాలకు కారణమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- ఎస్పీ అక్షాంశ్ యాదవ్

**యాదాద్రి భువనగిరి (ప్రభంజనం):**



విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, వృత్తి నైపుణ్యం కనబరుస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. భువనగిరి జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన 120 మంది పోలీసులకు ప్రశంసా పత్రాలను సోమవారం అందజేసి అభినందించారు. నేరాల ఛేదన, కేసుల దర్యాప్తు, సైబర్ నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో విశేష కృషి చేసిన సిబ్బంది సేవలను గుర్తించడం పోలీసు శాఖ బాధ్యతని పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనోత్సవాల్లో పటిష్ట బందోబస్తు నిర్వహించిన పోలీసుల సేవలను ప్రశంసించారు. తుర్కపల్లి పరిధిలోని పోక్సో, అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా వాదనలు వినిపించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ రెడ్డిని, బొమ్మలరామారం హత్య కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీసులను, గుండాల పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నర్సింహను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ భవిష్యత్తులోనూ మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

## నిర్మల్ ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి

- ప్రజా సమస్యలు విన్న ఎస్పీ డా. జి. జానకి షర్మిల
- ఫిర్యాదులపై తక్షణ స్పందన..
- చట్టపరంగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు

**నిర్మల్ ప్రతినిధి: ( ప్రభంజనం )**



నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను క్షుణ్ణంగా విన్న ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఫిర్యాదులను చట్టపరంగా పరిశీలించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి, దాని పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు శాఖ దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందిస్తూ పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు బీజేపీ అన్యాయం

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్
- న్యూఢిల్లీలో నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్..

**కంటోన్మెంట్,(ప్రభంజనం):**

దేశ ప్రజల ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యంగా అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అక్రమాలు జరుగుతున్నాయని, బీజేపీకి మాత్రమే ఎన్నికల్లో అనుకూల పరిస్థితి ఏర్పడేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. స్వతంత్ర భారత దేశంలో ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ప్రధాన పునాది అని, ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే స్వేచ్ఛను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

## రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు
- చిన్ననాటి నుండే తల్లితండ్రులు ట్రాఫిక్ పై అవగాహన కల్పించాలి

**కంటోన్మెంట్,(ప్రభంజనం):**




బోయిన్‌పల్లిలోని జాతీయ మేధో వైకల్యం గల వ్యక్తుల సాధికారత సంస్థలో సోమవారం తిరుమలగిరి ట్రాఫిక్ సిఐ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి, మల్కాజ్‌గిరి డీసీపీ ట్రాఫిక్ 1, రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడానికి ట్రాఫిక్ నియమాలను పాటించడం యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి శంకర్ రాజు మాట్లాడుతూ.. రహదారిభద్రత, ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సురక్షితంగా రోడ్డు దాటే పద్ధతులు, పాదచారుల భద్రత, ట్రాఫిక్ సిగ్నల్స్, ఇతర ముఖ్యమైన రహదారి భద్రతా చర్యల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులలో వారి సమాజంలో రహదారి భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ట్రాఫిక్ క్రమశిక్షణను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించగలరని చెప్పారు.సురక్షితమైన రహదారి అలవాట్లను పెంపొందించుకోవాలని ట్రాఫిక్ నిబంధనలను నిలకడగా పాటించాలని ఏసీపీ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో నీటి సమస్యలను పరిష్కరించండి

- కొత్త పైప్‌లైన్ ఏర్పాట్లపై చర్యలు తీసుకోండి
- జలమండలి అధికారులకు ఉప్పల్ ఎమ్మెల్యే సూచన

**ఉప్పల్, (ప్రభంజనం):**



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న నీటి సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించడం తో పాటు కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జలమండలి ఈడీ పంకజ, జీఎం సంతోష్ ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోఎదురవుతున్న నీటి సరఫరా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు కోసం తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ప్రజలకు నిరంతరాయంగా, సక్రమంగా తాగునీరు అందించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## ఉప్పల్ స్టేడియం రహదారి విస్తరణపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన

- సర్వే ఆఫ్ ఇండియా భూముల సేకరణ, ఆక్రమిత నిర్మాణాల తొలగింపుపై సమీక్ష

**ఉప్పల్, (ప్రభంజనం):**



ఉప్పల్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రహదారి రాకపోకలను మెరుగుపరిచే లక్ష్యంతో చేపట్టనున్న ఉప్పల్ స్టేడియం రహదారి 120 అడుగుల (36 మీటర్ల) విస్తరణ పనులపై మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి సర్వే ఆఫ్ ఇండియా (ఎస్ఓఐ) సూపరింటెండింగ్ సర్వేయర్, సంబంధిత ఎంఎంసి ఎస్ ఓ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి విస్తరణకు అవసరమైన సర్వే ఆఫ్ ఇండియా భూములను, వాటిపై ఉన్న కాంపౌండ్ వాల్స్‌తో పాటు కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు సంబంధించిన షెడ్లను అధికారులు కమిషనర్‌కు చూపించారు. రహదారి విస్తరణ పరిధిలోకి వస్తున్న సుమారు 0.78 ఎకరాల సర్వే ఆఫ్ ఇండియా భూమి ప్రభావితమవుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ భూముల సేకరణకు సంబంధించి నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపు అంశాన్ని పరిశీలించి, తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న ఎన్ఎస్ఎల్ భవనం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక బ్యారికేడింగ్ షీట్లను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చీఫ్ సిటీ ప్లానర్ ( సీసీపీ), సిటీ ప్లానర్ ( సీపీ)లకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. రహదారి విస్తరణ పనులు ముందుకు సాగేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉప్పల్ స్టేడియం రహదారి విస్తరణ పూర్తయితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపడటంతో పాటు వాహనాల రాకపోకలకు మరింత సౌలభ్యం కలుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. భూసేకరణ, పరిహారం, రహదారి విస్తరణకు సంబంధించిన అంశాలను సమన్వయంతో పరిష్కరించి, అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



## వైభవంగా దేవి శరన్నవరాత్రి వేడుకలు..

- ప్రత్యేక పూజలో పాల్గొన్న బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్

**కంటోన్మెంట్,(ప్రభంజనం):**

శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా న్యూ బోయిన్ పల్లి బాపూజీనగర్ శ్రీదేవి నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవి విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో పూజలు చేశారు. నవరాత్రులు వివిధ విశేషాలంకరణలో నల్లపోచమ్మ అమ్మవారికి పూజలు జరుగుతాయని జంపన ప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, సుధీర్, పవన్, శ్రీకాంత్, కొమురయ్య, నర్సింగరావు, నాగేశ్, మల్లేష్ లక్ష్మణ్ పాల్గొన్నారు.



## సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

- పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, (ప్రభంజనం):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవిలతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల ప్రాముఖ్యతను చాటుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ మహిళలు నిర్వహించే ఈ వేడుకలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, ఐక్యతను ప్రతిబింబిస్తాయని తెలిపారు. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.



# నిరసనలు నా పరిధి కాదు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

- **న్యాయస్థానం తలుపులు అందరికీ తెరిచే ఉంటాయన్న సీజేఐ**
- **పెండింగ్ కేసులపై నేరుగా సమావేశం కాలేమని స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ (ప్రభంజనం):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు. ఢిల్లీలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితి తన పరిధిలోకి రాదని తేల్చిచెప్పారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ 33వ వార్షికోత్సవాల సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇది శాంతి భద్రతల సమస్య, నా విభాగానికి చెందింది కాదు" అని సీజేఐ పేర్కొన్నారు.గత కొద్ది రోజులుగా రాజధానిలో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 20,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించడంతో ఢిల్లీ ఒక కోటను తలపించింది. భద్రతా చర్యల్లో భాగంగా శనివారం 45 మెట్రో స్టేషన్లను మూసివేశారు. సరిహద్దు ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ ఆందోళనల్లో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా వేలాది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు.. ఇండియా కూటమి నేతల నిరసన మార్చ్, తమను కలవాలన్న వారి అభ్యర్థనపై సీజేఐ స్పందిస్తూ.. సుప్రీంకోర్టు తలుపులు ప్రతి ఒక్కరికీ ఎప్పుడూ తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు. అయితే, ఎన్నికల అవకతవకలపై ప్రతిపక్ష నేతలను కలవలేనని ఆయన తేల్చిచెప్పారు. ఈ అంశం ఇప్పటికే న్యాయస్థానం పరిశీలనలో ఉన్నందున, సరైన పిటిషన్ దాఖలు చేసి న్యాయపరంగా ముందుకు రావాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలకు తాను రాసిన లేఖ వివరాలను ప్రస్తావిస్తూ.. పెండింగ్ కేసులపై చర్చించడానికి సమావేశం కావడం 'అధికార వేర్పాటు సిద్ధాంతానికి', రాజ్యాంగ నైతికతకు విరుద్ధమని ఆయన లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. అలాగే, ఈ అంశంపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనున్నట్లు ఆయన గుర్తుచేశారు.

# సౌదీ అరేబియాపై హౌతీల దాడులు

- **రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై దాడి**
- **14 మంది మృతి, వందలాది మందికి గాయాలు..**
- **విమాన సర్వీసులు నిలిపివేత**

**రియాద్, (ప్రభంజనం)**



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటు దళాలు సౌదీ అరేబియాపై క్షిపణులు, డ్రోన్లతో వరుస దాడులకు పాల్పడటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. రాజధాని రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడుల్లో పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం సంభవించింది. భద్రతా కారణాలతో విమానాశ్రయ కార్యకలాపాలను నిలిపివేయగా, పలు అంతర్జాతీయ విమానయాన సంస్థలు తమ సర్వీసులను రద్దు చేశాయి. ఈ పరిణామాలు సౌదీ భద్రతతో పాటు ప్రాంతీయ విమానయానం, ఆర్థిక కార్యకలాపాలపైనా ప్రభావం చూపుతున్నాయి. ఈ దాడులకు తామే బాధ్యులమని హౌతీలు ప్రకటించారు. విమానాశ్రయంలో ప్రయాణికులు, సిబ్బంది ఉన్న సమయంలో దాడులు జరగడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఇప్పటికే 14 మంది మృతి చెందగా.. పలువురు క్షతగాత్రులకు వైద్య చికిత్స కొనసాగుతోంది. విమానాశ్రయ ప్రాంగణంలో భద్రతా తనిఖీలు, నష్టాల అంచనా చేపట్టారు.

ఈ ఘటనలు గత దశాబ్దానికి పైగా కాలంలో సౌదీ గడ్డపై జరిగిన అత్యంత తీవ్ర దాడుల్లో ఒకటిగా పరిగణిస్తున్నారు.

**అక్టోబర్ 17 వరకు విమానాశ్రయం మూసివేత**

వరుస దాడుల నేపథ్యంలో రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు సౌదీ పౌర విమానయాన అధికారులు ప్రకటించారు. విమానాశ్రయం మూసివేతను అక్టోబర్ 17 వరకు పొడిగించారు. విమానాశ్రయ సౌకర్యాల భద్రత, కార్యకలాపాల పునఃప్రారంభానికి అవసరమైన తనిఖీల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. లుఫ్తాన్సా, ఎయిర్ ఫ్రాన్స్ సహా పలు అంతర్జాతీయ విమానయాన సంస్థలు రియాద్‌కు వెళ్లే విమానాలను రద్దు చేశాయి. ఇతర గల్ఫ్ విమానాశ్రయాలకు వెళ్లే సర్వీసులపైనా ప్రభావం పడింది. ప్రయాణికులు తమ విమానాల తాజా స్థితిని సంబంధిత విమానయాన సంస్థల ద్వారా తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**దమ్మామ్ విమానాశ్రయం, చమురు కేంద్రాలపైనా గురి**

రియాద్‌తో పాటు సౌదీ తూర్పు ప్రాంతంలోని దమ్మామ్‌లో ఉన్న కింగ్ ఫహద్ అంతర్జాతీయ విమానాశ్రయంపైనా దాడి జరిగినట్లు హౌతీలు ప్రకటించారు. విమానాశ్రయం సమీపంలో పేలుడు సంభవించినట్లు, అక్కడి సౌకర్యాలకు జరిగిన నష్టాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. సౌదీ చమురు దిగ్గజం ఆరామ్‌కోకు చెందిన రెండు కేంద్రాలపైనా దాడులు చేసినట్లు హౌతీ ప్రతినిధి ప్రకటించారు. దాడుల నేపథ్యంలో సౌదీ వైమానిక రక్షణ వ్యవస్థలు క్షిపణులు, డ్రోన్లను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాయి. కొన్ని లక్ష్యాలను అడ్డుకున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు వెల్లడించాయి. అయినప్పటికీ విమానాశ్రయాలపై జరిగిన దాడులు దేశ భద్రతా వ్యవస్థల సామర్థ్యంపై ప్రశ్నలను లేవనెత్తాయి.

**యెమెన్‌లో మళ్లీ ముదిరిన పోరు**

సౌదీ అరేబియాపై హౌతీల దాడులు తీవ్రతరం కావడానికి యెమెన్‌లో తాజాగా పెరిగిన సైనిక ఘర్షణలు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ దళాలు, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న సౌదీ నేతృత్వంలోని బలగాల మధ్య పోరు మళ్లీ తీవ్రమైంది.

**సౌదీకి అంతర్జాతీయ దేశాల మద్దతు**

రియాద్ విమానాశ్రయంపై దాడులను సౌదీ అరేబియాతో పాటు టర్కీ, పాకిస్థాన్, ఈజిప్ట్ తీవ్రంగా ఖండించాయి. ఈ దాడులు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలకు ముప్పుగా మారాయని ఆయా దేశాలు పేర్కొన్నాయి. హౌతీలు దాడులను తక్షణమే, ఎలాంటి షరతులు లేకుండా నిలిపివేయాలని డిమాండ్ చేశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా హౌతీలపై సౌదీ చేపట్టే సైనిక చర్యల్లో అమెరికా పాల్గొనే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం.



# ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది!

- **నిరసన వేదిక హోదా రద్దుపై అభిజీత్ దీప్కే ఆగ్రహం..**
- **దేశవ్యాప్త ఉద్యమానికి సంకేతాలు**

**న్యూఢిల్లీ, (ప్రభంజనం):**

దేశ రాజధాని ఢిల్లీలో దశాబ్దాలుగా నిరసనలు, ధర్నాలకు ప్రధాన వేదికగా కొనసాగుతున్న జంతర్ మంతర్‌కు అధికారిక నిరసన వేదిక హోదాను ఢిల్లీ పోలీసులు రద్దు చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రంగా స్పందించారు. ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు నిరసనలపై దేశవ్యాప్త చర్చకు దారితీశాయి.

**జంతర్ మంతర్‌పై పోలీసుల కీలక నిర్ణయం**

ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ అక్టోబర్ 11న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన వేదికల జాబితా నుంచి తొలగించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జంతర్ మంతర్‌కు బదులుగా ఢిల్లీలో మూడు ప్రత్యామ్నాయ నిరసన ప్రదేశాలను గుర్తించారు. అవి రామ్‌లీలా మైదాన్, బురారీ మైదాన్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్. కొత్త వేదికల్లో నిరసనలు నిర్వహించేందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడిగా జారీ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

# జంతర్ మంతర్‌లో ఇక నిరసనలకు తెర!

- **ఢిల్లీలో 3 కొత్త ప్రదేశాలు కేటాయింపు**
- **శాంతిభద్రతలే ప్రధాన సమస్య**

**నేషనల్ డెస్క్, ప్రభంజనం):**



రాజధాని ఢిల్లీలో నిరసనలకు దశాబ్దాలుగా కేంద్రంగా ఉన్న 'జంతర్ మంతర్ ను నిరసన వేదికల జాబితా నుంచి తొలగించారు. ఈ మేరకు ఢిల్లీ పోలీసులు జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి ప్రత్యామ్నాయంగా నగరంలో మూడు వేర్వేరు ప్రాంతాలను నిరసనలు, ప్రదర్శనల కోసం కొత్త వేదికలుగా ప్రకటించారు. ఈ మేరకు కొత్త స్టాండింగ్ ఆర్డర్ విడుదల చేసింది. దాని ప్రకారం.. ఇకపై ఓల్డ్ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్, ఉత్తర ఢిల్లీలోని బురారీ గ్రౌండ్ లను కొత్త నిరసన ప్రాంతాలుగా నోటిఫై చేసింది. ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సంతకం చేసిన ఈ తాజా ఉత్తర్వులు.. గతంలో ఏప్రిల్ 28, 2022న జంతర్ మంతర్‌ను నిరసన వేదికగా కేటాయించిన పాత ఆదేశాలను పాక్షికంగా సవరించాయి. ఈ మూడు కొత్త వేదికలపై నిరసనల నిర్వహణకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలను త్వరలోనే వేర్వేరుగా విడుదల చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. శాంతియుత నిరసన తెలిపేందుకు అనుమతి కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీకి, ఢిల్లీ పోలీసులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. సీజేపీ నేతలు సోమవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చి, నిరసన తేదీని ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. అనుమతి నిరాకరణకు గల కారణాలను తెలపాలని కోరారు. ఈ సందర్భంగా సీజేపీ చీఫ్ స్పోక్స్ పర్సన్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. తాము శాంతియుత నిరసన గురించి ముందే పోలీసులకు అధికారికంగా తెలియజేసినప్పటికీ, ఎలాంటి తేదీని కేటాయించలేదని విమర్శించారు. పోలీసులకు 24 గంటల గడువు ఇస్తున్నామని, స్పందించకపోతే భారీ మార్చ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా, నిరసనకారులపై పోలీసులు విచక్షణారహితంగా బలప్రయోగం చేశారని ఆయన ఆరోపించారు.

# జేఎన్‌యూలో లైంగిక వేధింపుల ఆరోపణలు..

- **కాంగ్రెస్ ఎంపీ బిమోల్ అకోయిజామ్‌పై ఎఫ్ఐఆర్**
- **11 మంది విద్యార్థినుల ఫిర్యాదుల నేపథ్యంలో కేసు నమోదు..**
- **అక్టోబర్ 9న ప్రొఫెసర్‌గా తొలగించిన వర్సిటీ..**
- **ఆరోపణలను ఖండించిన ఎంపీ**

**న్యూఢిల్లీ, (ప్రభంజనం)**



ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు, మాజీ ప్రొఫెసర్ అంగోంచా బిమోల్ అకోయిజామ్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. విశ్వవిద్యాలయం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అక్టోబర్ 11న వసంత్ కుంజ్ నార్త్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసు అధికారులు వెల్లడించారు.

**మేలో ఫిర్యాదులు..**

**11 మంది విద్యార్థినుల ఆరోపణలు**

జేఎన్‌యూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ పరిధిలో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ సిస్టమ్స్‌లో ప్రొఫెసర్‌గా పనిచేసిన అకోయిజామ్‌పై ఈ ఏడాది మే నెలలో కనీసం 11 మంది విద్యార్థినులు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. వైవా పరీక్షలు, తరగతులు, ఇతర విద్యాపరమైన సమావేశాల సందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేశారని విద్యార్థినులు ఆరోపించినట్లు తెలుస్తోంది. కొంతమంది విద్యార్థినులు క్యాంపస్‌లోని తన నివాసానికి సమావేశాలు లేదా ఇతర కార్యక్రమాల పేరుతో ఆహ్వానించి, అక్కడ కూడా అనుచితంగా ప్రవర్తించారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై జేఎన్‌యూ అంతర్గత కమిటీ విచారణ చేపట్టింది. కమిటీ విచారణలో ఫిర్యాదుదారుల వాంగ్మూలాలు, సాక్షుల వివరాలు, ఇతర ఆధారాలను పరిశీలించింది. అంతర్గత విచారణ అనంతరం అక్టోబర్ 9న అకోయిజామ్‌ను ప్రొఫెసర్ పదవి నుంచి తక్షణమే తొలగిస్తూ జేఎన్‌యూ నిర్ణయం తీసుకుంది. అంతర్గత కమిటీ నివేదికను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఈ చర్య చేపట్టినట్లు విశ్వవిద్యాలయం తెలిపింది. ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ ఎస్)లోని సెక్షన్ 75, సెక్షన్ 75(1)(i), సెక్షన్ 75(1)(iv), సెక్షన్ 79 కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**ఆరోపణలను ఖండించిన అకోయిజామ్**

తనపై వచ్చిన ఆరోపణలను అకోయిజామ్ ఖండించారు. జేఎన్‌యూ తనపై తీసుకున్న తొలగింపు నిర్ణయాన్ని ఆయన ప్రశ్నించారు. అంతర్గత కమిటీ విచారణలో సరైన విధానాలు పాటించలేదని, తన వాదనలు, సాక్షుల వాంగ్మూలాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. విచారణకు సంబంధించి తనకు వచ్చిన ఈమెయిళ్ల సంఖ్య, తాను సమర్పించిన వివరణలు, సాక్షుల వాంగ్మూలాల విషయంలో విశ్వవిద్యాలయ పరిపాలన చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ప్రశ్నించారు. తనపై చర్యను ఆయన రాజకీయ లేదా వ్యక్తిగత కక్షతో చేపట్టిన చర్యగా అభివర్ణించారు. ఈ వ్యవహారంలో న్యాయపరంగా ముందుకు వెళ్లేందుకు తన న్యాయ బృందం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

# ఫారం-6పై ఎలాంటి తీర్పూ ఇవ్వలేదు

- **సుప్రీంకోర్టు స్పష్టీకరణ**
- **కొత్త ఫారాన్ని ఆమోదించలేదు, తిరస్కరించలేదు..**
- **అక్టోబర్ 27న మరోసారి విచారణ**

**న్యూఢిల్లీ, (ప్రభంజనం):**




ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారం6కు సంబంధించిన వివాదంపై సుప్రీంకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రవేశపెట్టిన సవరించిన ఫారం6ను తాము ఆమోదించలేదని, తిరస్కరించలేదని, దాని చట్టబద్ధతపై ఇప్పటివరకు ఎలాంటి న్యాయపరమైన తీర్పు ఇవ్వలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా కొత్త ఫారం6 అంశాన్ని పరిశీలించలేదని పేర్కొంది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను అక్టోబర్ 27న విచారించనున్నట్లు తెలిపింది.

**ఫారం-6 వివాదం ఏమిటి?**

అర్హులైన పౌరులు ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఫారం6ను ఉపయోగిస్తారు. అయితే, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఈ ఫారానికి అదనపు ప్రకటనను జతచేయడంపై వివాదం తలెత్తింది. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే దరఖాస్తుదారుడు, గతంలో నిర్వహించిన ఎస్ఐఆర్ సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితాలో తన పేరు లేదా కుటుంబ సభ్యుల పేర్లు ఉన్నాయా అనే వివరాలను వెల్లడించాల్సిన నిబంధనను అదనపు ప్రకటనలో చేర్చినట్లు ప్రచారం జరిగుతుంది. ఈ మార్పులను అమలు చేయడానికి అవసరమైన చట్టపరమైన ప్రక్రియను అనుసరించారా లేదా అన్నది ప్రధాన వివాదంగా మారింది. ముఖ్యంగా, ఓటర్ల నమోదు నిబంధనల్లో అధికారిక సవరణలు చేయకుండా ఆన్‌లైన్ దరఖాస్తులో అదనపు వివరాలను కోరడం చట్టబద్ధమేనా అనే ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి.

**సుప్రీంకోర్టు ఏం చెప్పింది?**

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం కొత్త ఫారం6కు సంబంధించి దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, కొత్త ఫారం6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి స్పందిస్తూ, కొత్త ఫారం6పై కోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీహార్ ఎస్ఐఆర్ కేసును విచారించిన సమయంలో ప్రస్తుతం వివాదంలో ఉన్న కొత్త ఫారం6 కోర్టు పరిశీలనకు రాలేదని వివరించారు. గతంలో కోర్టు చేసిన వ్యాఖ్యలను ఫారానికి ఆమోదంగా లేదా తిరస్కరణగా అర్థం చేసుకోరాదని ధర్మాసనం పేర్కొంది. న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలను వాటి సందర్భానికి భిన్నంగా అర్థం చేసుకోవద్దని ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

# ఈడీ, సీబీఐ అధికారులు టచ్ లో ఉన్నారు!

- **రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు**
- **ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు**

**న్యూఢిల్లీ, (ప్రభంజనం):**



కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపైన, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పైన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పలు సంచలన విషయాలు వెల్లడించారు. ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన సుమారు 200 మంది అధికారులు తమతో టచ్‌లో ఉన్నారని పేర్కొంటూ కేంద్ర రాజకీయాల్లో కలకలం రేపారు. ఈడీ, సీబీఐ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. తదితర కీలక శాఖల్లో పనిచేస్తున్న దాదాపు 200 మంది ప్రభుత్వ అధికారులు ప్రతిపక్షాలతో టచ్‌లో ఉన్నారని, ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తున్నారని రాహుల్ గాంధీ సంచలన ప్రకటన చేశారు. నేరుగా ప్రధాని మోదీని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు గుప్పించిన రాహుల్.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని, రాత్రుళ్లు నిద్ర కూడా పోలేకపోతున్నారని ఆరోపించారు. ఆయనకు తన నుండి సందేశాలు వస్తున్నాయని చెబుతూ.. ఈ వివాదంలో తప్పు జరిగిందని, సీఈసీ వెంటనే రాజీనామా చేసి ఈ కేసులో 'అప్రూవర్'గా మారి అసలు నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సీఈసీని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. నిరసనకారులను అడ్డుకోవడానికి వేలాది మంది భద్రతా సిబ్బందిని మోహరించి ఢిల్లీని ఒక కోటలా మార్చేశారని విమర్శించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే వరకు, ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు యువత, విపక్షాల ఆందోళనలు ఆగవని ఆయన స్పష్టం చేశారు. పోలీసుల తీరును తప్పుబట్టిన ఆయన.. ఆందోళన చేస్తున్న యువతను అడ్డుకుంటున్న పోలీసులు, బీజేపీఆర్టీఎస్ కార్యకర్తలకు మాత్రం పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని ఆరోపించారు.




# రొమాంటిక్ కామెడీ.. డెబ్యూ ఇస్తున్న శ్రీకాంత్ కుమార్తె

టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలు, భారీ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ మరో కొత్త సినిమాను ప్రారంభించింది. ఈసారి ప్రేమ, హాస్యం, కుటుంబ భావోద్వేగాల కలయికతో ఓ వినోదాత్మక ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమైంది. ఈ చిత్రంలో జై జాస్తి, ప్రముఖ నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధా మేక జంటగా నటించనున్నారు. తాత్కాలికంగా ఈ సినిమాకు '#మైత్రీ ఇన్ లవ్' అనే పేరును ఖరారు చేశారు. 'ఉప్పెన' వంటి విజయవంతమైన ప్రేమ కథా చిత్రాన్ని అందించిన మైత్రీ మూవీ మేకర్స్.. మరోసారి రొమాంటిక్ కామెడీ కథాంశంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.అబ్బాయి, అమ్మాయి మధ్య ఉండే ప్రత్యేకమైన అనుబంధం, వారి మధ్య చోటుచేసుకునే ఆసక్తికర పరిణామాలు, ప్రేమలోని మధురమైన అనుభూతులు, హాస్యభరిత సంఘటనలతో ఈ సినిమాను రూపొందించనున్నారు. కుటుంబ భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఇస్తూ, నేటి తరం ప్రేక్షకులకు దగ్గరగా ఉండే కథతో ఈ చిత్రం తెరకెక్కనుంది.ఈ సినిమాలో జై జాస్తి కథానాయకుడిగా నటిస్తుండగా, మేధా మేక కథానాయికగా కనిపించనున్నారు. కొత్త జంటతో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి. '30 వెడ్స్ 21', 'మిడిల్ బెంచ్ రవి' వంటి ప్రజాదరణ పొందిన వెబ్ సిరీస్‌లతో గుర్తింపు తెచ్చుకున్న పృథ్వీ వనం ఈ సినిమాతో వెండితెర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. వెబ్ సిరీస్‌ల ద్వారా తనదైన గుర్తింపు సంపాదించుకున్న ఆయన.. ఇప్పుడు వెండితెరపై ప్రేమకథను ఎలా ఆవిష్కరిస్తారన్న ఆసక్తి నెలకొంది. ప్రముఖ గేయరచయిత రామజోగయ్య శాస్త్రి కుమారుడు సాయి హర్ష ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. అలాగే, 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి', 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు మహేశ్ బాబు పి ఈ ప్రాజెక్టుకు కథా రూపకల్పనలో భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని తాజాగా పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. నిర్మాతలు సాహు గారపాటి, అర్చన కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకురాలు నందినీ రెడ్డి క్లాప్ కొట్టారు. సౌమ్య యెర్నేని తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు.యువ నటీనటులు, కొత్త దర్శకుడు, ప్రతిభావంతులైన సాంకేతిక బృందంతో రూపొందుతున్న ఈ చిత్రంపై సినీ వర్గాల్లో ఆసక్తి మొదలైంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించాల్సి ఉంది. త్వరలోనే చిత్ర టైటిల్‌తో పాటు ఇతర విశేషాలను ప్రకటించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

# ఆదర్శ కుటుంబంలో అదిరిపోయే సర్‌ప్రైజ్..

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కుటుంబ కథాంశానికి వినోదాన్ని జోడిస్తూ త్రివిక్రమ్ ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్‌నగర్ వర్గాల్లో వినిపిస్తోంది. సినిమాలో ఓ ప్రత్యేకమైన అతిథి పాత్ర ఉండబోతుందనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఆదర్శ కుటుంబం'లో ఓ సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్‌ను త్రివిక్రమ్ ప్లాన్ చేసినట్లు సమాచారం. కథలో కీలకంగా నిలిచే అతిథి పాత్రను సినిమాలో చేర్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కమర్షియల్‌గా సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర వర్గాల్లో చర్చ నడుస్తోంది. ముఖ్యంగా వెంకటేష్ అభిమానులకు ఈ పాత్ర మంచి థ్రిల్‌ను అందిస్తుందని అంటున్నారు.అయితే ఆ అతిథి పాత్రలో ఎవరు కనిపించబోతున్నారు? ఆ పాత్ర కథలో ఎలాంటి మలుపు తీసుకురానుంది? అనే విషయాలపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత లేదు. చిత్రబృందం నుంచి ప్రకటన వస్తేనే ఈ వార్తలపై పూర్తి వివరాలు తెలుస్తాయి. ముందుగా 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 9న విడుదల చేయాలని భావించారు. అయితే కొన్ని కారణాలతో సినిమా విడుదల వాయిదా పడింది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, దీపావళి సందర్భంగా అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ఈ సినిమాలో వెంకటేష్‌తో పాటు నివేదా పేతురాజ్, నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేష్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు. వెంకటేష్‌కు కుటుంబ ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ, త్రివిక్రమ్‌కు వినోదాత్మక సంభాషణలు, కుటుంబ కథలను తెరకెక్కించడంలో ఉన్న ప్రత్యేకత ఈ సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. అతిథి పాత్రకు సంబంధించిన ప్రచారం నిజమైతే, అది సినిమాకు మరో ఆకర్షణగా మారే అవకాశం ఉంది.





# రామ్ చరణ్ – అనిరుధ్ కాంబినేషన్ ఫిక్స్.. క్రేజీ కాంబోపై భారీ అంచనాలు!

టాలీవుడ్‌లో ప్రస్తుతం స్టార్ హీరోల సినిమాలకు సంగీతం అందించే విషయంలో అనిరుధ్ రవిచందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తనదైన సంగీతంతో దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఈ యువ సంగీత దర్శకుడు.. ఇప్పుడు మెగా అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఓ క్రేజీ కాంబినేషన్‌లో భాగం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న సినిమాకు అనిరుధ్ సంగీతం అందించనున్నారనే వార్త ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.రామ్ చరణ్‌కు టాలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. మరోవైపు అనిరుధ్ రవిచందర్ తన సంగీతంతో భారీ సినిమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఆయన స్వరపరిచిన పాటలు, నేపథ్య సంగీతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

# చిత్రసీమలో మరో విషాదం.. పటేకర్ 'రీల్ అమ్మ' కన్నుమూత..!

బాలీవుడ్ విలక్షణ నటుడు నానా పటేకర్ (Nana Patekar) హఠాన్మరణం నుంచి తేరుకోకముందే సినీ అభిమానులకు మరో చేదువార్త. మరాఠీ సీనియర్ నటి మధు కాంబికర్ (Madhu Kambikar) కన్నుమూశారు. సినిమాల్లో పటేకర్‌కు తల్లిగా నటించిన ఆమె 73 ఏళ్ల వయసులో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో ఈ లోకాన్ని విడిచి వెళ్లారు. పటేకర్ మరణాన్ని జీర్ణించుకోలేక ముందే.. చిత్రపరిశ్రమను కాంబికర్ ఇకలేరనే వార్త మరింత విషాదానికి గురి చేసింది.చిత్ర సీమలో వరసగా రెండో విషాదం. బాలీవుడ్ నటుడు నానా పటేకర్ మరణించిన నాలుగు రోజుల్లోనే మరాఠి నటి మధు కాంబికర్ కన్నుమూశారు. ఆయనకు సినిమాల్లో తల్లిగా నటించిన ఆమె ఆరోగ్యం విషమించడంతో ప్రాణాలు విడిచారు. కొన్నాళ్లుగా పలు ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న కాంబికర్‌కు పక్షవాతం వచ్చింది. ఇదివరకున్న అనారోగ్యాలు.. ఈ స్ట్రోక్ కారణంగా ఆమె శరీరం తట్టుకోలేకపోయింది. 73 ఏళ్ల వయసులో తను తుది శ్వాస విడిచారు.






# 'రామాయణ' రెండో ట్రైలర్ దసరాకేనా..

భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత భారీ అంచనాలు నెలకొల్పుతున్న చిత్రాల్లో 'రామాయణ' కూడా ఒకటి. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ పౌరాణిక గాథలో బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా కనిపించనున్నారు. అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో చిత్రానికి సంబంధించిన రెండో థియేట్రికల్ ట్రైలర్‌ను దసరా సందర్భంగా విడుదల చేయనున్నారనే ప్రచారం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.'రామాయణ' చిత్రానికి సంబంధించిన రెండో ట్రైలర్‌ను అక్టోబర్ 20, 2026న విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే రోజున ప్రపంచవ్యాప్తంగా ముందస్తు టికెట్ విక్రయాలు కూడా ప్రారంభం కానున్నాయని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే రెండో ట్రైలర్ విడుదల తేదీపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. దసరా పండుగ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేస్తే సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా శ్రీరాముడి శక్తి, రావణుడి భీకరమైన రూపాన్ని ప్రధానంగా చూపిస్తూ ఈ కొత్త ట్రైలర్‌ను రూపొందిస్తున్నారనే వార్తలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే ట్రైలర్‌లో ఉండబోయే సన్నివేశాల వివరాలపై కూడా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.



# డ్యాన్స్ షో ఆఫర్ వస్తే అనుపమ పరమేశ్వరన్ షాకయ్యిందట

మలయాళంతోపాటు తెలుగు, తమిళ భాషల్లో నటిస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది అనుపమ పరమేశ్వరన్. ఈ బ్యూటీని ఒక ఆఫర్ సర్‌ప్రైజ్ చేసిందట. ఇంతకీ ఏ సినిమానో అనుకుంటున్నారా..?రింగురింగుల జుట్టుతో కుర్రకారు మనసులో చెరగని ముద్రవేసుకుంది కేరళ చిన్నది అనుపమ పరమేశ్వరన్. మలయాళంతోపాటు తెలుగు, తమిళ భాషల్లో స్టార్ యాక్టర్లతో కలిసి నటిస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఈ బ్యూటీని ఒక ఆఫర్ సర్‌ప్రైజ్ చేసిందట. ఇంతకీ ఏ సినిమానో అనుకుంటున్నారా..? కాదండి.. అనుపమకు ఓ పాపులర్ డ్యాన్స్ రియాలిటీ షో నుంచి ఆఫర్ వచ్చింది. తెలుగు రియాలిటీ డ్యాన్స్ షో 'ఢీ' నయా సీజన్‌కు జడ్జిగా చేయాలని ఆఫర్ రావడంతో షాకయ్యానని చెప్పింది అనుపమ.ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో అనుపమ మాట్లాడుతూ.. సినిమాలకు అతీతంగా కొత్త అవకాశాలను అన్వేషించడం తనకు ఇష్టమని చెప్పింది. సినిమాలో తన మార్క్ చూపించిన తర్వాత షార్ట్ ఫిల్మ్, మ్యూజిక్ వీడియోల్లో నటించే అవకాశాలు వచ్చాయని... ఢీ షోకు జడ్జిగా చేయాలనే ఆఫర్ వస్తుందని తానెప్పుడు ఊహించలేదని, డిఫరెంట్ ఫార్మాట్లలో ప్రయోగాలు చేయడాన్ని ఎంజాయ్ చేయడం వల్ల తాను షో చేసేందుకు ఒప్పుకున్నానని చెప్పుకొచ్చింది.ఎప్పుడైనా కొంతగా ప్రయత్నించే ఆసక్తికరమైన అవకాశాలు వస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానంది అనుపమ. డ్యాన్స్ షోకు జడ్జిగా చేయాలని అనుపమ నిర్ణయించుకోవడం కొత్త అనుభవాలను ఆవిష్కరించుకోవాలనే తన తపనను ప్రతిబింబిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి డ్యాన్స్ రియాలిటీ షోకు జడ్జిగా ప్రేక్షకుల దగ్గర అనుపమ ఎలాంటి మార్కులు కొట్టేస్తుందనేది చూడాలి.

# పెళ్లి పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన మమితా బైజు

బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయిన ఈ భామ పెళ్లిపై వస్తున్న పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.ప్రేమలు సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది మలయాళ భామ మమితా బైజు (Mamitha Baiju). ఇటీవలే సూర్యతో నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్ మూవీతోపాటు బెత్లెహామ్ కుటుంబ యూనిట్ సినిమాలతో మంచి హిట్‌స్‌ను ఖాతాలో వేసుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయిన ఈ భామ పెళ్లిపై వస్తున్న పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.తాను ఎవరిని పెళ్లి చేసుకుంటాననే విషయంతోపాటు తన జీవితంలోని ప్రతీ స్టెప్‌ను తన సోదరుడు మిథున్ బైజు నిర్ణయిస్తాడని చెప్పింది మమితా బైజు. నేను, నా సోదరుడు మిథున్ బైజు స్నేహితుల కంటే ఎక్కువ. నాకు సంబంధించి ప్రతీ నిర్ణయం మిథునే తీసుకుంటాడు. నా పెళ్లి విషయంలో కూడా మిథున్ తీసుకునే నిర్ణయమే ఫైనల్. నాకు వచ్చే లవ్ ప్రపోజల్స్ ను హ్యాండిల్ చేసేది కూడా అతడే.. అంటూ కామెంట్ సెక్షన్‌లోకి ఎంట్రీ ఇచ్చిన మమితా బైజు ఏంటీ..? అని రాసి ఉన్న డైలామాతో కూడిన మినియన్ స్టిక్కర్‌ను పోస్ట్ చేస్తూ తన పెళ్లిపై వస్తున్న పుకార్లకు చెక్ పెట్టింది.





# కివీస్ టూర్ ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ

- **తొలి రెండు మ్యాచ్‌లకు రిషబ్ పంత్ దూరం**
- **గాయంతో దూరం.. కుషాగ్రాకు గోల్డెన్ ఛాన్స్**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**

న్యూజిలాండ్‌ఏతో జరగనున్న మూడు మ్యాచ్‌ల అనధికారిక సిరీస్‌కు ముందు భారతఏ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయం కారణంగా తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అతడి స్థానంలో యువ వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుషాగ్రా జట్టులోకి వచ్చాడు. ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌లో పంత్‌కు గాయమైంది. టెస్టు సిరీస్‌కు సన్నాహకంగా భావిస్తున్న ఈ సిరీస్‌కు పంత్ ఎంపిక కూడా ఫిట్‌నెస్ అనుమతులకు లోబడే జరిగింది. పంత్ మూడో మ్యాచ్‌లో ఆడటంపై మరో ప్రకటన త్వరలో వెలువడుతుంది. కాగా, న్యూజిలాండ్‌లో టీమిండియా పర్యటనకు ముందు భారత్‌ఏ, న్యూజిలాండ్‌ఏ జట్ల మధ్య అనధికారిక టెస్ట్ సిరీస్ జరుగనుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ అక్టోబర్ 24న, రెండో మ్యాచ్ అక్టోబర్ 31న, మూడో మ్యాచ్ నవంబర్ 7న మొదలవుతాయి. ఈ సిరీస్ కోసం భారతఏ జట్టును కొద్ది రోజుల కిందటే ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా ధ్రువ్ జురెల్ ఎంపికయ్యాడు. ఈ జట్టులో పంత్, జురెల్‌తో పాటు భారత టెస్ట్ జట్టు రెగ్యులర్ సభ్యులు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ కూడా అవకాశం దక్కింది.

**అప్‌డేటెడ్ భారత్-ఏ జట్టు**

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, రవిచంద్రన్ స్మరణ్, ధ్రువ్ జురెల్ (కెప్టెన్, వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, ఔకిబ్ నబీ, ఆకాశ్ దీప్, అన్షుల్ కాంబోజ్, మానవ్ సుతార్, ముఖేశ్ చౌదరి, సాయి సుదర్శన్, యశ్ రాథోడ్, ముఖేశ్ కుమార్, కుమార్ కుషాగ్రా (తొలి రెండు మ్యాచ్‌లకు)

# హైదరాబాద్‌లో క్రికెట్ ఫీవర్

- **రేపు ఉప్పల్ స్టేడియంలో విండీస్‌తో నాలుగో టీ20**
- **ఉప్పల్ మ్యాచ్‌కు భారీ బందోబస్తు.. 2,200 మంది పోలీసులతో నిఘా**
- **ఇప్పటివరకు 25 వేల టికెట్లు విక్రయం.. 40 వేల మంది వరకు వచ్చే అవకాశం**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**





భారత్ వెస్టిండీస్ మధ్య నాలుగో టీ20 అక్టోబర్ 14న బుధవారం జరగనుంది. ఈ మ్యాచ్‌కు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం వేదిక కానుంది. ఇందుకోసం టీమ్‌ఇండియా జట్టు తాజాగా హైదరాబాద్ చేరుకుంది. రాజధాని నగరంలో టీమ్‌ఇండియా ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడనుండడంతో తెలుగు రాష్ట్రాల్లో ఫ్యాన్స్‌కు క్రికెట్ ఫీవర్ పట్టుకుంది.

**2200 మంది పోలీసులతో బందోబస్తు..**

ఉప్పల్ స్టేడియంలో సీటింగ్ కెపసిటీ గరిష్ఠంగా 55 వేలు. అంతమంది ఇక్కడ మ్యాచ్‌ను వీక్షించే అవకాశం ఉంది. అయితే బుధవారం జరగనున్న ఈ మ్యాచ్‌కు సంబంధించి ఇప్పటి దాకా 25000 టికెట్లు అమ్ముడైనట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తాజాగా వెల్లడించింది. ఇంకా టికెట్ సేన్ జరుగుతుండడంతో 40 వేల దాకా అభిమానులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ మ్యాచ్ కోసం పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. ఇందుకోసం 2,200 మంది పోలీసులు విధుల్లో ఉండనున్నట్లు చెప్పారు. బ్లాక్ టికెట్ల సేల్‌పైనా ప్రత్యేక నిఘా ఉంటుందని అధికారులు తెలిపారు.

**408 కెమెరాలు, 8 షీ టీమ్స్ ..**

అంతేకాకుండా నిఘా కోసం స్టేడియం చుట్టూ 4 వాచ్ టీమ్‌లు, 408 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు. ఇక మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అందుకోసం 8 షీ టీమ్స్ మఫ్టీలో ఉంటాయని సీపీ పేర్కొన్నారు. వీళ్లంతా ప్రేక్షకుల భద్రత కోసం సమన్వయంతో పనిచేస్తున్నారని అన్నారు. దాదాపు 8 వేల వాహనాలు నిలిపి ఉంచేలా పార్కింగ్ కోసం స్థలం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇక బంజారాహిల్స్ హోటల్ నుంచి ప్లేయర్లు స్టేడియానికి రానున్నారు.

**ఆర్టీసీ, మెట్రో సేవలు వినియోగించుకోవాలి..**

కాగా, మ్యాచ్ కోసం అభిమానులను మధ్యాహ్నం 2 గంటల నుంచే స్టేడియంలోకి అనుమతిస్తామని సీపీ చెప్పారు. అయితే స్టేడియానికి వచ్చే అభిమానులు ఆర్టీసీ, మెట్రో సేవలను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మ్యాచ్ నేపథ్యంలో స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పౌరులు నిబంధనలను పాటించాలని కోరారు.

**'ఎలా ఉన్నారు? హైదరాబాద్'- ఇషాన్ కిషన్**

ఇక ఈ మ్యాచ్ కోసం సాయంత్రమే భారత క్రికెట్ జట్టు హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ ప్రయాణంలో విమానంలో జరిగిన ఓ సరదా సన్నివేశాన్ని యువ క్రికెటర్ ఇషాన్ కిషన్ షేర్ చేసుకున్నాడు. హైదరాబాద్‌కు వస్తుండడంతో ఇక్కడి ప్రేక్షకుల కోసం తెలుగులో మాట్లాడుతూ ఓ సెల్ఫీ వీడియో రికార్డ్ చేశాడు. 'హలో! హైదరాబాద్, ఎలా ఉన్నారు?' అని ఇషాన్ సరదాగా అన్నాడు. ఈ వీడియోలో అతడి పక్కన తెలుగు క్రికెటర్లు తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి ఉన్నారు. కాగా, ఐపీఎల్‌లో ఇషాన్ మన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకే ఆడుతున్నాడు. అందుకే అతడు ఉప్పల్ స్టేడియాన్ని హోమ్ గ్రౌండ్‌లాగా భావిస్తాడు.



# ఆసియా క్రీడల్లో సైనిక అథ్లెట్ల సత్తా

- **20 పతకాలతో మెరిసిన సైనిక అథ్లెట్లు**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**

అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారత అథ్లెట్లు మరింత రాణించేలా సైన్యం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ తెలిపారు. ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో భారత సైనిక అథ్లెట్లు కనబరిచిన ప్రతిభ.. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లోనూ రాణించే సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి తగిన శిక్షణ, అవకాశాలు కల్పించడంలో భారత సైన్యం కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు.

**20 పతకాలతో సైనిక అథ్లెట్ల సత్తా**

ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన సైనిక క్రీడాకారులను ఢిల్లీలోని మానెక్షా కేంద్రంలో భారత సైన్యం ఘనంగా సత్కరించింది. ఈ పోటీల్లో సైనిక అథ్లెట్లు మొత్తం 20 పతకాలు సాధించారు. వీటిలో ఆరు స్వర్ణాలు, ఎనిమిది రజతాలు, ఆరు కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ విజయాలు రాబోయే అంతర్జాతీయ పోటీలకు సైనిక అథ్లెట్లను సిద్ధం చేయడంలో ప్రోత్సాహాన్నిస్తాయని అధికారులు పేర్కొన్నారు.

**మిషన్ ఒలింపిక్ వింగ్‌తో ప్రోత్సాహం**

సైన్యంలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు మిషన్ ఒలింపిక్ వింగ్ ద్వారా దేశవ్యాప్తంగా పలు స్పోర్ట్స్ నోడ్స్ ఏర్పాటు చేసినట్లు జనరల్ ధీరజ్ సేథ్ తెలిపారు. బాలుర, బాలికల కోసం ప్రత్యేక స్పోర్ట్స్ కంపెనీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. వీటి ద్వారా ప్రతిభావంతులను గుర్తించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు వివరించారు.

# రూ.10 లక్షలకే అమెరికా లెఫ్ట్ ఆర్మ్ పేసర్!

- **ఎంఐ గూటికి తారా నోరిస్**
- **ఢిల్లీ నుంచి యూపీ, ఇప్పుడు ముంబైకి**
- **వేలానికి రంగం సిద్ధం.. రూ.10 లక్షలతో స్టార్ పేసర్‌ను దక్కించుకున్న ముంబై**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**

మహిళల ప్రీమియర్ లీగ్ ఐదో సీజన్ వేలానికి ముందే ముంబై ఇండియన్స్ ప్లేయర్ ట్రేడింగ్‌తో వార్తల్లో నిలిచింది. అలాఅనీ హార్దిక్ పాండ్యాను వదులుకోలేదు. టీ20ల్లో నిలకడగా రాణిస్తున్న మహిళా పేసర్ తారా నోరిస్‌ను ముంబై మహిళల జట్టు భారీ ధరకు కొన్నది. అసోసియేటెడ్ దేశాల ప్లేయర్ అయిన నోరిస్‌ను యూపీ వారియర్స్ నుంచి ముంబై కొనుక్కుంది. ఏకంగా రూ.10 లక్షలు ఇచ్చి ఈ ఎడమ చేతివాటం పేసర్‌ను తీసుకుంది ముంబై. నిరుడు వేలంలో నోరిస్‌ను యూపీ ఇంతే ధరకు కొన్న విషయం తెలిసిందే. ఐదో సీజన్ మహిళల ప్రీమియర్ లీగ్ వేలం సమీపిస్తున్న వేళ ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 28న కొచ్చిలో వేలం జరగనుండగా.. అంతకు ముందే అనుభవజ్ఞురాలై పేసర్‌ను ట్రేడింగ్ పద్ధతిలో తమ కుటుంబంలోకి ఆహ్వానించింది ముంబై. ఫ్రాంచైజీ క్రికెట్‌లో, డబ్ల్యూపీఎల్‌లో నిలకడగా రాణిస్తున్న తారా నోరిస్‌ను భారీ ధరకు దక్కించుకుందీ మాజీ ఛాంపియన్. గత ఎడిషన్‌లో యూపీ వారియర్స్‌కు ఆడిన ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌ను రూ.10లకు కొనేసింది ముంబై. నాలుగో సీజన్ వేలంలో నోరాను యూపీ ఇంతే మొత్తానికి కొన్నది. దాంతో.. అంతే ధరకు ఇప్పుడు ఆమెను ముంబైకి అప్పగించింది యూపీ. తను ముంబైకి ఆడడం ఇదే మొదటిసారి కాదు. ఇదివరకు ది హండ్రెడ్ లీగ్‌లో ఎంఐ లండన్ జెర్సీతో నోరిస్ మైదానంలో మెరిసింది.

**ఢిల్లీ వదిలేయడంతో**

డబ్ల్యూపీఎల్‌లో తొలుత ఢిల్లీ క్యాపిటల్స్‌కు 2023 సీజన్‌లో ఆడిన తారా నోరిస్ ఆకట్టుకుంది. ఐదు మ్యాచులాడిన తను 4.33 సగటుతో తను 7 వికెట్లు తీసింది. ఆ తర్వాతి ఎడిషన్ వేలంలో నోరిస్‌ను యూపీ వారియర్స్ కొన్నది. అయితే.. మహిళల టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫయర్ కోసం అమెరికా స్క్వాడ్‌కు ఎంపికవడంతో తను ఆ సీజన్ ఆడలేదు. 2026 సీజన్ వేలంలో యూపీ ఆమెకు రూ.10 లక్షలు చెల్లించింది. సెప్టెంబర్ 28న తుది గడువున నోరిస్‌ను అట్టిపెట్టుకుంది యూపీ. ఆ తర్వాత ముంబై ట్రేడింగ్ ప్రతిపాదన తీసుకురాగా తనను అంతే ధరకు అప్పగించేందుకు యూపీ అంగీకరించింది. దాంతో, వేలానికి ముందు ముంబై జట్టు విదేశీ ప్లేయర్ల కోటా నిండింది. ప్రస్తుతం ఎంఐ ఖాతాలో రూ.90 లక్షలున్నాయి.




# మలేసియా చిత్తు..

- **అండర్-17 ఆసియా కప్‌లో దూసుకెళ్తున్న భారత వనితలు**
- **క్వాలిఫయర్స్‌లో మూడుకు మూడు మ్యాచ్‌లు గెలిచిన భారత్**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**

భారత అండర్17 మహిళల ఫుట్‌బాల్ జట్టు చరిత్ర సృష్టించింది. వచ్చే ఏడాది జరగబోయే మహిళల ఆసియా కప్‌కు అర్హత సాధించింది. ఈ టోర్నీకి వరుసగా రెండోసారి అర్హత సాధించిన తొలి భారత జట్టుగా నిలిచింది. వయసు విభాగాల్లోనే కాదు సీనియర్ లెవల్‌లో కూడా బ్యాక్ టూ బ్యాక్ ఆసియా కప్‌కు క్వాలిఫై అయిన మొట్టమొదటి భారత జట్టు ఇదే. అండర్ 17 ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి జరిగిన తమ చివరి గ్రూపు మ్యాచ్‌లో భారత్ 40 తేడాతో మలేసియాపై ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. దీంతో గ్రూపుఈలో ఇండియా టీమ్ 9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్ టోర్నమెంట్‌కు దూసుకొచ్చింది. క్వాలిఫయర్స్‌లో మొదటి నుంచి భారత్ ఆకట్టుకుంది. మూడు గ్రూపుల మ్యాచ్‌లకుగాను మూడింట గెలిచింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఇరాక్, సిరియాలను ఓడించింది. ఇక మలేసియాతో చివరి మ్యాచ్‌లోనూ సత్తాచాటింది. ఈ మ్యాచ్‌లోనూ స్పష్టమైన ఆధిపత్యం ఇండియాదే. భారీ వర్షం కారణంగా మైదానం బురదమయంగా మారింది. బంతిని పాస్ చేయడానికి ఇరు జట్లు కష్టపడ్డాయి. ఈ కఠిన పరిస్థితుల్లోనూ భారత దూకుడుగా ఆడింది. 28వ నిమిషంలో రిదిమా దేవి చింగ్‌ఖమాయుమ్ జట్టుకు తొలి గోల్ అందించింది. ఆ తర్వాత ప్రీతిక బర్మాన్, అనుష్క కుమారి, నిధి వరుసగా చెరో గోల్ చేశారు.

# సంజు ఇలాగే ఆడితే.. వైభవ్‌కు చాన్స్ ఎప్పుడొస్తుంది?

- **మేనేజ్‌మెంట్‌ను నేరుగా ప్రశ్నించిన దిగ్గజ స్పిన్నర్ అశ్విన్**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**



భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కకపోవడంపై చర్చ కొనసాగుతోంది. వెస్టిండీస్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌కు ఎంపికైనప్పటికీ.. ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఈ 15 ఏళ్ల కుర్రాడికి ఆడే అవకాశం రాలేదు. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం సంజు శాంసన్ నిలకడగా రాణిస్తుండటంతోనే వైభవ్‌కు అవకాశాలు దక్కడం లేదని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం సంజు శాంసన్ తన ప్రదర్శనలతో వైభవ్‌ను జట్టుకు దూరం చేస్తున్నాడు. వైభవ్‌కు అవకాశం ఇవ్వాలని నేను భావిస్తున్నప్పటికీ.. జట్టు ఎంపికలో ఇలాంటి పరిస్థితులు ఎదురవుతుంటాయి. ఓపెనర్ అభిషేక్ శర్మ స్థానానికి ప్రస్తుతం ఎలాంటి ముప్పు లేదు. అతడు అద్భుతమైన ప్లేయర్. బ్యాట్ ఝుళిపిస్తే భారత్‌కు విజయాలు అందించగలడు. అభిషేక్ తన స్థానాన్ని పటిష్టం చేసుకోవడంతో మరో ఓపెనర్ స్థానం కోసం పోటీ నెలకొంది. ఈ పరిస్థితుల్లో సంజు శాంసన్ ప్రదర్శనలు కూడా వైభవ్ అవకాశాలను ప్రభావితం చేస్తున్నాయి. సంజు ఇలాగే రాణిస్తుంటే మరి వైభవ్‌కు ఎప్పుడు అవకాశం వస్తుంది?' అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో వెల్లడించాడు.

**ఈ మ్యాచ్‌లోనైనా అవకాశం దక్కేనా?**

ఇప్పటికే సిరీస్‌లో 21 తేడాతో ఆధిక్యంలో ఉన్న టీమిండియా.. హైదరాబాద్‌లో జరిగే నాలుగో టీ20లోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని భావిస్తోంది. ఈ మ్యాచ్‌లోనైనా వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇస్తారా? లేక సంజు శాంసన్, అభిషేక్ శర్మలతోనే ఓపెనింగ్ కొనసాగిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# రంజీని నాశనం చేస్తారా?

- **దేశవాళీ క్రికెట్‌ను బీసీసీఐ పట్టించుకోదా?**
- **స్టార్ ప్లేయర్లు లేకపోతే ఆ పరుగులకు విలువ ఉందా?**
- **బీసీసీఐపై సునీల్ గవాస్కర్ సంచలన విమర్శలు**

**స్పోర్ట్స్ డెస్క్, (ప్రభంజనం):**



బీసీసీఐపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రతిష్ఠాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీకి ప్రాధాన్యత ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టాడు. రంజీ ట్రోఫీ సమయంలో భారత్‌ఏ సిరీస్‌లను షెడ్యూల్ చేయడంపై అసహనం వ్యక్తం చేశాడు. ఈ విధానం వల్ల దేశవాళీ టోర్నీ ప్రాధాన్యతను బీసీసీఐ స్వయంగా తగ్గిస్తోందని ఘాటుగా విమర్శించాడు. ఈ అనాలోచిత భారత్‌ఏ షెడ్యూల్ కారణంగా కీలక ఆటగాళ్లు ఆయా రాష్ట్రాల రంజీ టీమ్‌లకు దూరమయ్యారని గవాస్కర్ మండిపడ్డాడు. ఇటీవలే ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన మూడు వన్డేల అనధికారిక సిరీస్‌లో పాల్గొన్న రజత్ పటిదార్, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి ఆటగాళ్లు తొలి రౌండ్ రంజీ మ్యాచ్‌లకు దూరమయ్యారు. ఇదే విషయాన్ని ప్రస్తావించిన గవాస్కర్.. అప్‌కమింగ్ న్యూజిలాండ్‌ఏ పర్యటన కారణంగా మరికొంత మంది ఆటగాళ్లు దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. 'రంజీ ట్రోఫీలో టాప్ క్లాస్ ఆటగాళ్ల గైర్హాజరీ కారణంగా దేశవాళీ క్రికెటర్ల నిజమైన సత్తాను అంచనా వేయడం కష్టంగా మారుతోంది. రంజీల్లో రాణించిన ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయిలో ఇబ్బంది పడటం మనం చూస్తున్నాం. నాణ్యమైన ఆటగాళ్లు లేకపోతే పోటీ బలహీన పడుతుంది. అప్పుడు సాధారణ బ్యాటర్ కూడా 2000 పరుగులు చేస్తాడు. బౌలర్ 100 వికెట్లు పడగొడుతారు. అన్ని రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్లేట్ డివిజన్‌ను చేర్చడం ద్వారా టోర్నీ ప్రమాణాలు దారుణంగా పడిపోయాయి. ఇండియా 'ఏ' మ్యాచ్‌లను దేశవాళీ రంజీ సీజన్‌కు అడ్డంకి లేకుండా నిర్వహించాలి. రంజీ ట్రోఫీకి బీసీసీఐ అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.'అని సునీల్ గవాస్కర్ డిమాండ్ చేశాడు. ఈ వాదనకు మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా మద్దతు పలికాడు.

Published by Cheviti Ashok on behalf of Printing Ratna Graphics, Editor : Sampath Ganga. RNI No - TGTEL/26/A3750.